


అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

14.08.2026
శుక్రవారం | రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 45
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# విచారణ జరగాలి

- యూనిటీ మాల్ ఒప్పందంపై
- ఎంపీ రఘునందన్ రావు
- తెలంగాణలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయి



2లో..

**హైదరాబాద్, ఆగస్ట్ 13, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి ఇరువైపులా ఉన్నటువంటివని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు.

# కళ్యాణలక్ష్మిపై న్యాయస్థానం బ్రేక్

- పేదింటి ఆడబిడ్డల ఆశలపై ఆందోళన.!
- ఎనిమిది జీవోలపై హైకోర్టు స్టే.. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌కు ఎదురుదెబ్బ
- కౌంటర్ దాఖలాలో జాప్యం..
- ప్రభుత్వ తీరుపై హైకోర్టు అసహనం
- తులం బంగారం హామీ ఏమైంది.!?
- పెండింగ్‌లో వేల దరఖాస్తులు బుట్ట దాక లేనా?
- సాయం కోసం పేద కుటుంబాల ఎదురుచూపులు
- పథకం రద్దా.. కొనసాగింపా? హైకోర్టు తీర్పుపైనే ఆశలు
- సంక్షేమ పథకాలకు చట్టబద్ధత ఎక్కడ?..
- తెలంగాణ ప్రభుత్వ వైఖరిపై రాజకీయ దుమారం

6లో..




**పేదింటి ఆడబిడ్డ పెళ్లి అంటే కుటుంబానికి ఆనందంతో పాటు ఆర్థిక భారం కూడా ఉంటుంది. ఈ భారాన్ని కొంతైనా తగ్గించాలనే ఉద్దేశంతో తెలంగాణలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అమలులోకి వచ్చాయి. 2014లో ప్రారంభమైన ఈ పథకాలు వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలిచాయి. అయితే ఇప్పుడు ఈ పథకాల అమలే న్యాయస్థానం పరిశీలనలోకి రావడం రాజకీయంగానూ, సామాజికంగానూ చర్చనీయాంశంగా మారింది. హైకోర్టులో దాఖలైన వ్యాజ్యం పథకాల ఉద్దేశాన్ని కాకుండా వాటిని అమలు చేస్తున్న ప్రభుత్వ ఉత్తర్వుల రాజ్యాంగబద్ధతను ప్రశ్నించింది. ప్రభుత్వానికి కౌంటర్ దాఖలు చేసేందుకు నాలుగు వారాల సమయం ఇచ్చినా, తదుపరి విచారణలోనూ సమాధానం విషయంలో ఆలస్యం చోటుచేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. జూలైలో కోర్టు ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యతలపై కూడా ప్రశ్నలు లేవనెత్తింది. ఇక్కడ అసలు ప్రశ్న ఒక్కటే. పేదల కోసం ఉద్దేశించిన సంక్షేమ పథకం కొనసాగాలా వద్దా అనే రాజకీయ వాదన కంటే, దాని అమలుకు అవసరమైన చట్టపరమైన ఆధారం ఏమిటన్నదే న్యాయపరమైన అంశం. ఈ నేపథ్యంలో తాజా స్టే మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.**

**తెలంగాణ ప్రతినిధి, ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే ఆడబిడ్డలకు అండగా నిలిచింది అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాల వివాహ ఖర్చులకు ప్రభుత్వం అందించే ఒకసారి ఆర్థిక సహాయంగా కొనసాగుతు వచ్చాయి. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ అధికారిక ఈపాస్ పోర్టల్‌లో కూడా కల్యాణలక్ష్మి పథకానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాల అర్హత వివరాలు, షాదీ ముబారక్‌కు మైనారిటీ వర్గాల అర్హత వివరాలు అందుబాటులో ఉన్నాయి. ఈ రెండు పథకాల అమలుకు సంబంధించిన ఎనిమిది ప్రభుత్వ ఉత్తర్వుల రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ న్యాయవాది విజయ్ గోపాల్ హైకోర్టును ఆశ్రయించారు. కేవలం కార్యనిర్వాహక ఉత్తర్వుల ఆధారంగా ప్రజాధనం ఖర్చు చేయడం పై పిటిషన్‌లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ విచారణ చేపట్టారు. జూలై 8న విచారణ సందర్భంగా ప్రభుత్వానికి నాలుగు వారాల వ్యవధిలో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. అనంతరం జూలై 9న జరిగిన విచారణలో ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యతలపైనా న్యాయస్థానం ప్రశ్నలు సంధించింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం సమయానికి పూర్తి వివరణ ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది. కానీ కౌంటర్ దాఖలు విషయంలో ఆలస్యం జరగడం తాజా పరిణామాలకు దారితీసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఇప్పుడు స్టే.. దరఖాస్తు లబ్ధిదారుల్లో ఆందోళన**

ఆగస్టు 13న వెలువడిన తాజా నివేదికల ప్రకారం తెలంగాణ హైకోర్టు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుపై స్టే విధించింది. దీంతో పథకాల ద్వారా ఆర్థిక సహాయం పొందాల్సిన కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. అయితే ఈ స్టేను పథకాలు శాశ్వతంగా రద్దయినట్లు భావించకూడదు. కేసులో తుది తీర్పు వెలువడే వరకు న్యాయపర మైన పరిస్థితి మారే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన అంశం కూడా రాజకీయ చర్చలో ఉంది. ఈ నేపథ్యంలో నగదు సహాయం, తులం బంగారం హామీ, పథకాల అమలు వేగం వంటి అంశాలను ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలకు ఉపయోగిస్తున్నాయి. అయితే 2024, 2025లో పెళ్లైన పేద ఆడబిడ్డలకు ఎంతమంది దరఖాస్తుదారులకు సహాయం అందలేదు,

# కేంద్రానికి సుప్రీంకోర్టు అల్టిమేటం

ఫుడ్ ఐటమ్స్ లేబులింగ్‌పై.. మీరు చేయలేకపోతే, మేమే చేస్తాం

2లో..



# బాదల్‌పై హత్యాయత్నం

- అకాలీదళ్ చీఫ్ సుఖ్‌బీర్ సింగ్
- నాందేడ్ గురుద్వారాలో ఘటన
- కత్తితో దాడిచేసిన యువకుడు

నాందేడ్, ఆగస్ట్ 13, అనంత జనశక్తి న్యూస్

అకాలీ దళ్ అధినేత, పంజాబ్ మాజీ డిప్యూటీ సీఎం సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై మహారాష్ట్రలోని నాందేడ్‌లో గురువారం దాడి జరిగింది. గురుద్వారాలో ఆయనపై నిహంగ్ సిక్కు కిర్పాన్‌తో దాడిచేసినట్టు వర్గాలు తెలిపాయి. నిందితుడ్ని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు.. బాదల్‌ను చికిత్స కోసం నాందేడ్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

2లో..

# రాజకీయ దురుద్దేశ్యం లేదు

- అది నిరూపిస్తే రాజకీయం వదిలేస్తా
- పోచారం శ్రీనివాసరెడ్డి సవాల్



**నిజామాబాద్, ఆగస్ట్ 13, అనంతజనశక్తి న్యూస్**

ఇటీవల తాను చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి రాజకీయం దురుద్దేశ్యం లేదని.. బుద్ధిహీనులు నాకు స్వార్థం ఉందని మాట్లాడుతున్నారని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. గురువారం కామారెడ్డి జిల్లా వర్ని మండలంలో పర్యటించి, జాకోరా గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల తాను చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. తనకు స్వార్థం ఉందని నిరూపిస్తే రాజకీయాలు వదులుకుంటానన్నారు. "నా మాటల వెనుక రాజకీయం, రహస్యం లేదు. నేను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదు. నాకు ఎలాంటి స్వార్థం లేదు. ప్రజల కోసమే నా జీవితం. అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రికి మద్దతు తెలిపాను.

2లో..

# మరణాలను 70 % వరకు తగ్గించగలిగాం

5లో..



- ఏనుగుల వల్ల జరిగే మృతులు
- ఏనుగులు.. అడవుల సంరక్షణకు..
- జీవవైవిధ్యానికి కాపలాదారులు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**విశాఖపట్నం, ఆగస్ట్ 13, అనంత జనశక్తి న్యూస్**

ఏనుగులు.. అడవుల సంరక్షణ, జీవవైవిధ్యానికి కాపలాదారులు, దేశ వారసత్వానికి ప్రతీకలు అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖలోని గురువారం ఏర్పాటు చేసిన ప్రపంచ ఏనుగుల దినోత్సవ కార్యక్రమంలో పవన్ పాల్గొన్నారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. 2014 నుంచి ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కు పెరిగింది. 150 ఏనుగుల కారిడార్లు గుర్తించి రక్షణ కల్పించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 132 142 అడవి ఏనుగులు ఉన్నాయి.

# భూ కేటాయింపులపై బీఆర్ఎస్ రాజకీయం

- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి
- టెస్సరాక్ట్ సంస్థ భూముల వ్యవహారం
- బీఆర్ఎస్ హయాంలో..
- 54 కంపెనీలకు భూ కేటాయింపులు

2లో..

# హిందూ, ముస్లింలు నా రెండు కళ్లు

- కేవలం మాటల్లో కాదు.. చేతల్లో చూపించామన్న సీఎం రేవంత్
- మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన
- 'మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్'కు హాజరు
- మైనారిటీ రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేస్తోంది
- గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాల్లో..
- మైనారిటీ యువత మెరుగైన స్థానాలను సాధించారు

5లో..



**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**

**హైదరాబాద్ కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో 'మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్'లో పాల్గొన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హిందూ, ముస్లింలు తనకు రెండు కళ్ల లాంటివారని, మాటల్లో కాకుండా చేతల్లో సోనియా గాంధీ ఆ రీతిగా నిరూపించారని తెలిపారు. మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గుర్తుచేస్తూ, తెలంగాణలో అధికారంలోకి వస్తే ఆ రిజర్వేషన్లను తొలగిస్తామన్న అమిత్ షా సవాల్‌కు గుజరాత్‌లో ముందు తొలగించి చూపించాలని ఆరోపించామన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీ రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేస్తోందని, గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాల్లో మైనారిటీ యువత మెరుగైన స్థానాలను సాధించారని స్పష్టం చేశారు.**

గతంలో గ్రూప్ 1 ప్రశ్నపత్రాలు పల్లీ బఠానీల్లా అమ్ముడయ్యాయని, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అర్హత లేని వారిని నియమించారని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, యూపీఎస్సీని అధ్యయనం చేసి రిటైర్డ్ డీజీపీని చైర్మన్‌గా నియమించామని చెప్పారు. అభ్యర్థుల ఉద్యోగాల నియామకాన్ని అడ్డుకోవడానికి కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు వెళ్లినా, మంచి అడ్వకేట్లతో పోరాడి అభ్యర్థుల తరపున నిలబడి ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో మైనారిటీ సభ్యుడిని నియమించడమే కాకుండా, అజారుద్దీన్‌కు మంత్రి పదవి, నిఖత్ జరీన్‌కు గ్రూప్ 1 ఉద్యోగం సిరాజ్‌కు నిబంధనలు సవరించి డీఎస్పీ ఉద్యోగాన్ని అందించామన్నారు.

# ఎన్టీఆర్ కాలం నాటి రాజకీయాలు మళ్లీ రావాలి

- స్పీకర్ అయ్యన్న పాత్రుడు
- రాజకీయాల్లోకి రావాలనుకునే వారు..
- లక్ష్మీనారాయణను చూసి చాలా నేర్చుకోవాలి

2లో..

**హైదరాబాద్, ఆగస్ట్ 13, అనంత జనశక్తి న్యూస్**

దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ కాలం నాటి రాజకీయాలు మళ్లీ రావాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆకాంక్షించారు. రాజకీయాల్లోకి రావాలనుకునే వారు కన్నా లక్ష్మీనారాయణను చూసి చాలా నేర్చుకోవాలని సూచించారు. గురువారం గుంటూరు జిల్లా వేదికగా మీడియాతో అయ్యన్నపాత్రుడు మాట్లాడారు. ఇప్పుడు జనం ఓసారి ఓటేస్తే.. రెండోసారి ఓటేయటం లేదని అన్నారు.

# గాంధీ పుట్టిన దేశంలో ప్రజాస్వామ్యానికి సంకెళ్లు

- సీఎం చంద్రబాబుపై జగన్ మండిపాటు
- బాధితులే నిందితులుగా మారుతున్న దారుణ పరిస్థితి
- ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు
- చివరకు ఎమ్మెల్యేల ఇళ్లను కూడా ధ్వంసం

2లో..

**అమరావతి, ఆగస్ట్ 12, అనంత జనశక్తి న్యూస్**

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలువుతున్న 'రెడ్ బుక్ రాజ్యాంగం'పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్, జైలుకు పంపిన తీరు రాష్ట్రంలో బాధితులే నిందితులుగా మారుతున్న దారుణ పరిస్థితికి అద్దం పడుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తూ, చివరకు ఎమ్మెల్యేల ఇళ్లను కూడా ధ్వంసం చేసి అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రాజకీయ దురుద్దేశ్యం లేదు



(మొదటి పేజీ తరువాయి)

అన్నం పెట్టిన వాళ్లను మర్చిపోతే పుట్టగతులుండవు. కేసీఆర్ చేసింది కాబట్టే చేసిండు అని చెప్పాను. రేవంత్ రెడ్డి ఇచ్చినవి కూడా చెబుతాను. ఉన్నది ఉన్నట్లు చెప్పడం నా నైజం. పోరాటం చేస్తా తప్ప, తల వంచే రాజకీయం చేయను. నా ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏమైనా చేస్తాను. ఎమ్మెల్యేకు ప్రభుత్వ సహకారం కావాలి. ప్రభుత్వ సహకారం లేకుంటే ఏమి చేయలేం." అని వ్యాఖ్యానించారు.

నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్ వద్దకు వెళ్లి కండువా కప్పుకొన్నట్లు ఇటీవల మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆరు నెలల్లో పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని.. సగం నిధులు మాత్రమే ఇచ్చారన్నారు. కామారెడ్డి జిల్లా బీర్కూరులో కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పోచారం ఈ వ్యాఖ్యలు చేశారు. బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల గుత్తేదారులు పనులు ఆపేశారని.. నవంబర్‌లో ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ నిర్వహించారమన్నారు. ఆ సమావేశంలో సీఎం రేవంత్‌ను సూటిగా ప్రశ్నించినట్లు తెలిపారు. సీఎం చెప్పినట్లుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి నిధులు మంజూరు చేయలేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని స్పష్టం చేశారు. ఈ వ్యాక్యలపై ఒక్కసారిగా రాజకీయ దుమారం రేగింది. దీంతో మరోసారి ఈ వ్యాఖ్యలపై క్లారిటీ ఇచ్చారు.

# గాంధీ పుట్టిన దేశంలో ప్రజాస్వామ్యానికి సంకెళ్లు

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఈ కుట్రల పాలన సాగుతోందని జగన్ విమర్శించారు. రాత్రి 2:45 గంటల సమయంలో వందల మంది పోలీసులు దొంగల్లా, బందిపోటు ముఠాలా వచ్చి ఎమ్మెల్యే విరూపాక్షి ఇంటి డోర్లు, సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఆయనను అపహరించుకుపోయారని ఆరోపించారు. పగటిపూట నోటీసులు ఇస్తే రాని ఉగ్రవాదా ఆయన అని ప్రశ్నించారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై మూడు అక్రమ కేసులు పెట్టడమే కాకుండా ఆయన కుమారుడు, తమ్ముడు, తమ్ముడి కుమారుడిని కూడా ఈ కేసుల్లో ఇరికించారని మండిపడ్డారు. ఆగష్టు 1న సంగాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గిరిపై దాడి జరుగుతుంటే, ఆయన రక్షణ కోసం ఎమ్మెల్యే విరూపాక్షి మానవత్వంతో అక్కడికి వెళ్లడమే నేరమన్నట్లు పోలీసులు వ్యవహరించారని జగన్ తెలిపారు. స్థానిక ఎస్సై, సీఐలకు ఫోన్ చేసినా పోలీసులు కాపాడకపోవడంతోనే ఎమ్మెల్యే స్వయంగా వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఆ తర్వాత నెమకల్లు వద్ద ఎమ్మెల్యేపై దాడి చేసి, ఆయన తమ్ముడి చెయ్యి విరగ్గొట్టారని వెల్లడించారు.

ఈ నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఒక టీడీపీ కార్యకర్త తన భార్య బట్టలు తానే చించి, ఆ నెపం ఎమ్మెల్యేపై నెట్టి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయని, సదరు మహిళతో తప్పుడు మాటలు చెప్పిస్తూ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని, ఈ అక్రమాలపై ప్రజాస్వామ్యవాదులంతా ఆలోచించాలని జగన్ పిలుపునిచ్చారు.

# బాదల్‌పై హత్యాయత్నం



(మొదటి పేజీ తరువాయి)

దాడి చేసిన వ్యక్తిని నిహంగ్ సిక్కు అయిన జస్పాల్ సింగ్‌గా గుర్తించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. దాడి చేసిన వ్యక్తి గత రెండేళ్లుగా ఆ గురుద్వారాలో పనిచేస్తున్నాడు. దాడి అనంతరం బయటకు వచ్చిన వీడియోలో, బాదల్ తన కుడి చేతికి కాషాయ వస్త్రాన్ని చుట్టుకుని నడుస్తూ కనిపించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. దాడి చేసిన వ్యక్తి సుఖ్‌బీర్ బాదల్‌ను కడుపులో కత్తితో పొడవడానికి ప్రయత్నించాడు.. కానీ భద్రతా సిబ్బంది అతడ్ని అడ్డుకోవడంతో చేతికి గాయమైంది. బాదల్‌కు ప్రాణాపాయం లేదని అకాలీ దళ్ వర్గాలు తెలిపాయి. నాందేడ్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, బాదల్ చేతికి కుట్లు పడ్డాయని తెలిపారు.

దాడి జరిగిన కొద్ది సేపటికే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్.. నాందేడ్ ఎస్పీతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దాడి వెనుక ఉద్దేశం ఏంటో దర్యాప్తు చేయాలని పోలీసులకు ఆయన నిర్దేశించారు. ఇదిలా ఉండగా, దాదాపు రెండేళ్ల కిందట అమృత్‌సర్‌లో జరిగిన హత్యాయత్నం నుంచి బాదల్ త్రుటిలో తప్పించుకున్నారు. డిసెంబరు 4, 2024లో స్వర్ణదేవాలయం బయట ఆయనపై ఓ యువకుడు కాల్పులకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో బాదల్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. దుండగుడ్ని వెంటనే అదుపులోకి తీసుకున్నారు.

2007 నుంచి 2017 వరకు పంజాబ్‌లో కొనసాగిన శిరోమణి అకాలీదళ్ పార్టీ బీజేపీ కూటమి పాలనలో చేసిన 'తప్పులకు' గాను, బాదల్, పలువురు ఎస్ఏడీ నాయకులకు అకాల్ తఖ్త్ 'టాంఖా' (మతపరమైన శిక్ష) విధించిన తరువాత ఆయన స్వర్ణ దేవాలయంలో 'సేవాదార్' విధులు నిర్వర్తిస్తుండగా ఆయనపై దాడి జరిగింది. కాగా, ప్రాణాలకు తీవ్రమైన ముప్పు పొంచి ఉన్నందున సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌కు అత్యున్నత స్థాయి జెడ్‌ప్లస్ భద్రత కొనసాగుతోంది.

## భూ కేటాయింపులపై
# బీఆర్‌ఎస్ రాజకీయం

హైదరాబాద్, ఆగస్ట్ 13, అనంత జనశక్తి న్యూస్



టెస్సరాక్ట్ సంస్థకు కేటాయించిన భూములపై బీఆర్‌ఎస్ రాజకీయం చేస్తోందని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ఆయన మాట్లాడారు. 'ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో బీఆర్‌ఎస్ హయాంలో 54 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి. వారి హయాంలో ఎకరాకు రూ.30లక్షల నుంచి రూ.80లక్షల చొప్పున ఇచ్చారు. మా ప్రభుత్వం వచ్చాక 8 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి. ఎకరా రూ.1.50 కోట్లకు కేటాయించాం. 5 ఎకరాలు కావాలని టెస్సరాక్ట్ సంస్థ 2024లో దరఖాస్తు చేసుకుంది. ఏడాదిపాటు పరిశీలించి ఆ సంస్థకు 2025లో భూమిని కేటాయించాం. అందరికీ కేటాయించినట్టుగానే ఆ సంస్థకు కూడా ఎకరా రూ.1.50కోట్ల చొప్పున ఇచ్చాం. 2025 వరకు టెస్సరాక్ట్ సంస్థకు కొండల్‌రెడ్డి డైరెక్టర్, మేనేజింగ్ డైరెక్టర్ కాదు'' అని ఎంపీ చామల వివరించారు.

# విచారణ జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రం ఇచ్చిన రూ.202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించారని ఎంపీ రఘునందర్ రావు అన్నారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఆరు ఎకరాలకు పైగా భూమి ఇచ్చిందన్నారు. అయితే, ఈ ఒప్పందంలో అవినీతి జరిగిందన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై విచారణ జరగాలని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు. కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిగినప్పుడు, కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్‌ఎస్ హయాంలో 10 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించారని, దానిపైనా విచారణ జరగాలన్నారు. ఈ రెండు భూకేటాయింపు ఒప్పందాలపై సమదృష్టితో దర్యాప్తు జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు.

యూనిటీ మాల్, గత బీఆర్‌ఎస్ భూకేటాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీ చెప్పుకొచ్చారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై డీపీఆర్ నుంచి చివరి చెల్లింపు వరకు సీబీఐ విచారణ జరపాలన్నారు. కేవలం మూడు బ్యారేజీలపై కాకుండా మొత్తం ప్రాజెక్టుపై దర్యాప్తు చేయాలన్నారు. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టుపై విచారణ జరిపించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని ఎంపీ సూచించారు. దానిపై కేంద్ర హోంమంత్రిని కలిసి దర్యాప్తు జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. మరోవైపు, రింగ్ రోడ్డు, ఫార్ములా ఈ రేస్, కాళేశ్వరం అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని ఎంపీ మండిపడ్డారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని రఘునందన్ రావు విమర్శించారు. వీళ్లిద్దరూ అవినీతిలో అన్నదమ్ములంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలకు బీజేపీ విజ్ఞప్తి చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఎంపీ తేల్చి చెప్పారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కస్టోడియన్లుగా ఉండాలని, అంతేకానీ యజమానులుగా వ్యవహరించొద్దని ఆయన పేర్కొన్నారు.



# కేంద్రానికి సుప్రీంకోర్టు అల్టిమేటం

- అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వులు..
- ఆహార పదార్థాలపై తప్పనసరిగా హెచ్చరికలు చేయాలి

న్యూఢిల్లీ, ఆగస్ట్ 13, అనంతజనశక్తి న్యూస్

ఆహార పదార్థాల లేబులింగ్ విషయంలో కేంద్రానికి సర్వోన్నత న్యాయస్థానం అల్టిమేటం ఇచ్చింది. అధిక మొత్తంలో చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వులు కలిగిన ప్యాక్ చేసిన ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుళ్లను 'మీరు చేయలేకపోతే.. మేము చేస్తామని' సుప్రీంకోర్టు గురువారం కేంద్ర ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. ఈ విషయంలో కేంద్రం, భారత ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధికారులు ఏమైనా కార్పొరేట్ సంస్థల ఒత్తిడికి లొంగిపోతున్నారా? అని నిలదీసింది.

**కార్పొరేట్ ఒత్తిడికి ప్రభావితం**

''ఈ అంశం పౌరులు ముఖ్యంగా ఎదుగుతున్న పిల్లల ఆరోగ్యానికి సంబంధించింది. దీనిపై తీసుకునే నిర్ణయాలు కార్పొరేట్ ఒత్తిళ్లకు ప్రభావితం కాకూడదు'' అని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఆహార పదార్థాల లేబులింగ్ విషయంలో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా FSSAI తీరును ధర్మాసనం తప్పుపట్టింది. ఆహార రంగ పరిశ్రమ ఈ లేబుళ్లను వ్యతిరేకిస్తోందని FSSAI చేసిన వాదనలను పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. మార్చి 7న జరిగిన FSSAI సమావేశం మినిట్స్‌ను పిటిషనర్ తరఫు లాయర్ ప్రస్తావిస్తూ.. అందులో తీసుకున్న నిర్ణయాలు కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలకు పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్యాకెట్లపై హెచ్చరిక లేబుళ్లను ఆహార పరిశ్రమ వ్యతిరేకిస్తోందని పేర్కొంటూ.. దానికి బదులుగా రోజువారీకి అవసరమైన చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు పరిమాణాన్ని తెలియజేసే పట్టిక రూపంలో ఇవ్వాలని FSSAI ప్రతిపాదించింది. అయితే, FSSAI తన అఫిడవిట్‌లో కేవలం ఆహార పరిశ్రమ వ్యతిరేకతను మాత్రమే పేర్కొందని, చక్కెర, ఉప్పు, కొవ్వులు ఎక్కువ ఉన్న ఆహారాల వినియోగాన్ని తగ్గించడానికి హెచ్చరిక లేబుళ్లు ఎంత అవసరమో పౌర సమాజం ప్రతినిధులు సమర్పించిన ఆధారాలను పూర్తిగా విస్మరించిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**ప్రభుత్వం సిద్ధంగా లేదా?**

దీనికి స్పందించిన ధర్మాసనం.. ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా లేదా? అని కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ బ్రిజేందర్ చాహర్‌ను సూటిగా ప్రశ్నించింది. అంతేకాదు, తమ ఉత్తర్వులు స్పష్టంగా ఉన్నాయని పునరుద్ఘాటించింది. బడా కార్పొరేట్ సంస్థల నుంచి ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోందని, దానికి 'తలొగ్గుతోందని' వ్యాఖ్యానించింది.

కేవలం ప్రజా ప్రయోజనాల కోసమే తాము ఈ చర్యలు తీసుకుంటున్నామని ధర్మాసనం పేర్కొంది. కోర్టు ఆదేశాలను ఎందుకు అమలు చేయడం లేదని, ఇప్పటివరకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటో చెప్పాలని నిలదీసింది. 'ప్రభుత్వమే స్వయంగా ఈ పని చేస్తుందా, లేక మేమే ఉత్తర్వులు జారీ చేయాలా?' అని కోర్టు ఆగ్రహం



వ్యక్తం చేసింది. ప్రభుత్వం తీసుకోబోయే చర్యలను వివరించడానికి అనుమతించాలని అదనపు సొలిసిటర్ జనరల్ కోరగా... తమ ఆదేశాలను ప్రభుత్వం అమలు చేసి తీరాల్సిందేనని తేల్చిచెప్పింది. 'మీరు చేయలేకపోతే, మేమే తగిన ఉత్తర్వులు ఇస్తాం' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

**రెడ్ వార్నింగ్ మార్కులు**

సాంప్రదాయ భారతీయ ఆహార పదార్థాల ఉదాహరణలను ప్రస్తావిస్తూ, ఈ ప్రతిపాదిత నిబంధనల వల్ల నామ్‌కీన్ వంటి అనేక ఉత్పత్తులపై 'రెడ్ వార్నింగ్ మార్కులు' వచ్చే అవకాశం ఉందని కేంద్రం వాదించింది. అభివృద్ధి చెందిన దేశాల్లోని ఆహార పదార్థాల్లో ఉప్పు, చక్కెర, కొవ్వు స్థాయిలు తక్కువగా ఉంటాయని, కాబట్టి ఆ ప్రమాణాలను నేరుగా భారతీయ సాంప్రదాయ ఆహారాలకు వర్తింపజేయడం సరికాదని ASG వాదించారు.

అభివృద్ధి చెందిన దేశాలు పాటించే అంతర్జాతీయ ప్యాకేజింగ్ ప్రమాణాలను భారత్ పాటించడం కష్టమన్న కేంద్రం వాదనను నిరాకరిస్తూ''భారత్ ఎప్పటికీ అభివృద్ధి చెందని దేశంగానే ఉండిపోవాలా?' అని కోర్టు ప్రశ్నించింది. దేశ ప్రజల, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వానికి ఇష్టం లేదా అని నిలదీసింది.

# దేశంలోనే నంబర్ వన్ రాజధానిగా అమరావతి

అమరావతి, ఆగస్ట్ 13, అనంతనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి ఇప్పుడే ప్రారంభమైందని, భవిష్యత్తులో దేశంలోనే నంబర్ వన్ రాజధానిగా అమరావతి నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర ప్రజలంతా అమరావతి అభివృద్ధిపై ఆలోచించాలని, రాబోయే రోజుల్లో రాజధాని నిర్మాణం అన్‌స్టాపబుల్‌గా కొనసాగుతుందని పేర్కొన్నారు. రాజధాని అమరావతిని అనుసంధానించే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ3ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఉండవల్లి వద్ద సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించే స్టీల్ బ్రిడ్జిల ప్రారంభానికి సూచికగా శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు.

**96 కి.మీ. ఇన్నర్ రింగ్ రోడ్డు.. 190 కి.మీ. ఔటర్ రింగ్ రోడ్డు**

అమరావతి చుట్టూ 96 కిలోమీటర్ల ఇన్నర్ రింగ్ రోడ్డు, 190 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించబోతున్నామని చంద్రబాబు తెలిపారు. ఈ ప్రాజెక్టులకు కేంద్రం కూడా ఆమోదం తెలుపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పనులను ప్రారంభించారని, 2028లో భారత దేశం మెచ్చే అమరావతి ప్రారంభోత్సవానికి ప్రధాని మళ్లీ వస్తారని పేర్కొన్నారు. ఇక, అమరావతి వాస్తు పరంగా కూడా అద్భుతమైన ప్రాంతమని చంద్రబాబు అన్నారు. స్పీడ్ యాక్సిస్ రోడ్డు పూర్తయిన తర్వాత అమరావతి అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు. రాజధాని నిర్మాణం ఒకవైపు వేగంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**అమరావతి ఉద్యమంలో పవన్ కల్యాణ్ కీలక పాత్ర**

గతంలో వైసీపీ నాయకులు రాష్ట్రంలో విధ్వంసానికి పాల్పడ్డారని చంద్రబాబు విమర్శించారు. అమరావతి రాజధాని ఉద్యమానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా మద్దతుగా పోరాడారని గుర్తుచేశారు. ముళ్లకంపలను సైతం లెక్కచేయకుండా రైతులకు అండగా పవన్ నిలిచారని పేర్కొన్నారు. తన భార్య చేతి గాజులను కూడా అమరావతి కోసం విరాళంగా ఇచ్చారని చంద్రబాబు తెలిపారు.

అన్ని కష్టాలను అధిగమించి అమరావతి రాజధాని నిర్మాణాన్ని మళ్లీ ప్రారంభించామని చంద్రబాబు అన్నారు. రాజధానిలో విద్యుత్ తీగలు, కరెంట్ పోల్స్ కనిపించకుండా ఆధునిక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి ఇంటికి నేరుగా విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్యాస్‌పై ఆధారపడకుండా వంట చేసుకునే సౌకర్యాలను కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రపంచంలో మరెక్కడా లేని స్థాయిలో అమరావతికి నీటి వనరులు ఉన్నాయని చంద్రబాబు అన్నారు. కృష్ణా నది తీరంలో రాజధాని నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ప్రకృతి వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ అమరావతిని ఆధునిక, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

**బ్లూ సిటీ.. గ్రీన్ సిటీ.. గ్రీన్ ఎనర్జీ**

అమరావతిని నో పొల్యూషన్ సిటీ, బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ సిటీగా అభివృద్ధి చేస్తున్నామని చంద్రబాబు వివరించారు. కాలుష్యరహిత వాతావరణంతో పాటు ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. అమరావతిని భవిష్యత్తులో డీప్‌టెక్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. అమరావతిలో నివసించే ప్రజలకు ఆరోగ్యకరమైన, సౌకర్యవంతమైన జీవన వాతావరణం కల్పించడమే లక్ష్యమని చంద్రబాబు అన్నారు. అమరావతిలో జీవించే వారికి ఆయుష్షు పెరిగేంత ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా నగరాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. భవిష్యత్తులో రాజధానిలో ప్రయాణించేటప్పుడు ప్రత్యేకమైన అనుభూతి కలిగేలా రహదారులు, భవనాలు, మౌలిక వసతులను నిర్మిస్తున్నామని తెలిపారు.

**కరకట్ట కష్టాలకు ఇక చెక్**

ఇప్పటివరకు ప్రజలు ఎదుర్కొన్న కరకట్ట ప్రాంత ప్రయాణ కష్టాలు ఇకపై ఉండవని చంద్రబాబు అన్నారు. ఆధునిక రహదారులు, మెరుగైన కనెక్టివిటీ, సమగ్ర మౌలిక వసతులతో అమరావతి ప్రజలకు మరింత సౌకర్యవంతమైన రాజధానిగా మారనుందని స్పష్టం చేశారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు..

**నా గ్రేట్ విజన్‌కు తొలి సక్సెస్**

రాజధాని అమరావతి నిర్మాణంలో రైతుల పాత్ర ఎంతో కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి రైతులది కేవలం త్యాగం మాత్రమే కాదని, భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చే అంశమని పేర్కొన్నారు. అమరావతి నిర్మాణం తన గ్రేట్ విజన్‌కు తొలి విజయమని అన్నారు. రైతుల నమ్మకం, సహకారం లేకపోతే అమరావతి రాజధాని సాధ్యమయ్యేది కాదని స్పష్టం చేశారు. రాజధాని అమరావతిని అనుసంధానించే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ3ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఉండవల్లి వద్ద సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించే స్టీల్ బ్రిడ్జిల ప్రారంభానికి సూచికగా శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు.

**రాజధాని ఎక్కడ అన్నదానిపై తొలుత గందరగోళం**

2014లో ఆంధ్రప్రదేశ్ విభజన జరిగినప్పుడు కొత్త రాష్ట్రానికి రాజధాని ఎక్కడ ఉండాలనే అంశంపై స్పష్టత లేకపోయిందని చంద్రబాబు తెలిపారు. శివరామకృష్ణన్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశామని, కమిటీ నివేదికలో మెజార్టీ ప్రజలు రాజధానిని ఈ ప్రాంతంలోనే నిర్మించాలని అభిప్రాయపడ్డారని చెప్పారు. అనంతరం అసెంబ్లీలో చర్చ జరిగి అమరావతిని రాజధానిగా నిర్ణయించినట్లు తెలిపారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తొలి రాష్ట్రంగా ఏర్పడిందని, రాష్ట్ర విభజన తర్వాత వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అమరావతిలో రాజధాని నిర్మించాలని సంకల్పించినట్లు సీఎం వివరించారు.

**హైటెక్ సిటీని కట్టినప్పుడు కూడా విమర్శలు**

తాను హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మించేటప్పుడు కూడా పలువురు విమర్శలు చేశారని చంద్రబాబు గుర్తుచేశారు. రోడ్లు వేసి తాను షో చేస్తున్నానని కొందరు ఎగతాళి చేశారని, అయినా వెనక్కి తగ్గలేదన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వంటి మౌలిక వసతులను నిర్మించి చూపించానని చెప్పారు. అదే నమ్మకంతో అమరావతి నిర్మాణానికి రైతులు ముందుకొచ్చారని సీఎం తెలిపారు. తాను సైబరాబాద్‌ను నిర్మించిన అనుభవాన్ని చూసి రైతుల్లో విశ్వాసం పెరిగిందని, విజయవాడ, గుంటూరు, మంగళగిరి, అమరావతి ప్రాంతాల రైతులు రాజధాని కోసం భూములు ఇచ్చారని పేర్కొన్నారు.

**రైతులు లేకపోతే అమరావతి లేదు**

**రాజధాని నిర్మాణానికి రైతులు ముందుకు రాకపోతే అమరావతి సాధ్యమయ్యేది కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణం కోసం రైతులు తమ భూములను ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. అమరావతి రైతులది త్యాగమే కాకుండా గొప్ప స్ఫూర్తి అని పేర్కొన్నారు.**

**సింగపూర్ మాస్టర్ ప్లాన్.. ఒక్క రూపాయి తీసుకోలేదు**

**అమరావతిని సింగపూర్ తరహాలో ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించాలనే సంకల్పంతో తాను సింగపూర్ వెళ్లినట్లు చంద్రబాబు తెలిపారు. తనపై ఉన్న నమ్మకంతో సింగపూర్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా అమరావతి మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన వివరాలు అందించిందన్నారు. ఐకానిక్ భవనాలు, అసెంబ్లీ భవనాలకు సింగపూర్ డిజైన్లు ఇచ్చిందని చెప్పారు. అయితే ఆ డిజైన్లను చూసి కొందరు 'గ్రాఫిక్స్ రాజధాని' అంటూ ఎగతాళి చేశారని చంద్రబాబు విమర్శించారు. ఆ డిజైన్లు వాస్తవరూపం దాల్చితే అప్పట్లో విమర్శలు చేసిన రాజకీయ పార్టీలు, నాయకులు ఏమవుతారో ఆలోచించుకోవాలని వ్యాఖ్యానించారు.**

# ఎన్టీఆర్ కాలం నాటి రాజకీయాలు మళ్లీ రావాలి

(మొదటి పేజీ తరువాయి)

**అలాంటిది ఆరుసార్లు ప్రజల మనసు దోచుకుని కన్నా లక్ష్మీనారాయణ గెలిచారని ప్రస్తావించారు. అప్పటిలా జనం లేరని.. పూర్వం నాయకులు ఇప్పుడు లేరని అన్నారు. కన్నా క్రమశిక్షణ, వచ్చిన వారిని పలకరించటం, పని అవుతుం దంటే చేసి పెట్టడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. ప్రజలకు ఏం కావాలో వారి అవసరాలు తీర్చేలా పని చేశారని ప్రశంసించారు. కన్నా మాదిరిగా మిగతా వారు పని చేస్తే ఏపీ బాగుపడుతుందని తెలిపారు. రాజకీయాలు ఇప్పుడు వ్యాపారం అయ్యాయని అన్నారు. కన్నా మరింత ఆరోగ్యంగా ఉండి ప్రజలకు మరింత సేవ చేయాలని అయ్యన్నపాత్రుడు ఆకాంక్షించారు.**

# టీఎంసీ ప్రభుత్వం ఇచ్చిన అవార్డు వెనక్కి

- బీజేపీకి చెందిన రాజ్యసభ ఎంపీ
- నేతాజీ బోస్‌ను 'యుద్ధ నేరస్థుడు' అంటూ
- నాగేంద్ర రాయ్ కామెంట్లు

న్యూఢిల్లీ,ఆగస్ట్ 13, అనంత జనశక్తి న్యూస్

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను అవమానించారనే ఆరోపణలు ఎదుర్కొంటోన్న బీజేపీ ఎంపీ నాగేంద్ర రాయ్‌కు పశ్చిమ్ బెంగాల్ ప్రభుత్వం షాకిచ్చింది. ఆయనకు గతంలో ఇచ్చిన 'బంగ విభూషణ్' అవార్డును వెనక్కి తీసుకుంటున్నట్టు గురువారం ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అప్పటి మమతా బెనర్జీ ప్రభుత్వం ఆయనను ఈ అవార్డుతో సత్కరించింది. నాగేంద్ర రాయ్ అనంత్ మహారాజ్ పేరుతో పాపులర్ అయ్యారు. నేతాజీపై గత నెలలో అనంత్ మహారాజ్ చేసిన వ్యాఖ్యలతో బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆజాద్ హింద్ ఫౌజ్ పాత్ర, నేతాజీ నాయకత్వం, కూచ్ బెహార్ మహారాజు చారిత్రక ప్రాముఖ్యతకు సంబంధించి ఆయన చేసిన వ్యాఖ్యలే ఇందుకు కారణం. ప్రతిపక్షాలతో పాటు బీజేపీలోని ఒక వర్గం కూడా ఈ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. స్వాతంత్ర్య సమరయోధుడు, బెంగాల్‌లో అత్యంత గౌరవనీయ నాయకుడైన నేతాజీపై సోషల్ మీడియాలో అభ్యంతరర వ్యాఖ్యలు చేసే వారిపై అరెస్టులతో సహా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సువేందు అధికారి పోలీసులను ఆదేశించిన 24 గంటల్లోనే ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ చట్టం ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులకు సమానంగా వర్తిస్తుందని కూడా ఆయన తెలిపారు. స్వాతంత్ర్య సంగ్రామంలో అజాద్ హింద్ ఫౌజ్ పాత్ర, బోస్ నాయకత్వాన్ని ప్రశ్నిస్తూ నేతాజీని 'యుద్ధ నేరస్థుడు' అని అనంత్ మహారాజ్ అభివర్ణించిన కొద్ది రోజులకే సీఎం సువేందు అధికారి పోలీసులకు ఈ ఆదేశాలు జారీ చేశారు. ఉత్తర బెంగాల్‌లోని రాజబన్షీ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ బీజేపీ నాయకులలో ఒకరైన అనంత మహారాజ్.. రాజ్యసభ ఎంపీగా కొనసాగుతున్నారు. మమతా బెనర్జీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఫిబ్రవరిలో ఈ బీజేపీ ఎంపీకి బంగా బిభూషణ్ పురస్కారం లభించింది. రాష్ట్రానికి, దాని ప్రజలకు చేసిన విశిష్టమైన, ఆదర్శప్రాయమైన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేస్తారని, దీనికి అత్యున్నత గౌరవం, ప్రతిష్ట ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. 'బంగ విభూషణ్ పురస్కారానికి నాగేంద్ర రాయ్ అర్హుడు కాదు.. అవార్డుకు ఉన్న గౌరవం, ప్రతిష్టకు తగినట్లుగా లేదని సంబంధిత అధికారి సంతృప్తి చెందారు. కాబట్టి, 2026 ఫిబ్రవరి 21న ప్రదానం చేసిన బంగ విభూషణ్ పురస్కారాన్ని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకుంటూ రద్దు చేస్తోంది'' అని ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. అయితే, గత నెల అమిత్ షా పర్యటన సందర్భంగా గ్రేటర్ కూచ్ బెహార్ పీపుల్స్ అసోసియేషన్‌లో బీజేపీపై కూడా ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# వివాదానికి ఇక ముగింపు పలకండి.. మాల్యా, ఎస్‌బీఐకు బాంబే హైకోర్టు సూచన



పరారీలో ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్త విజయ్ మాల్యా, బ్యాంకుల మధ్య ఆస్తుల వివాదానికి ఇక స్వస్తి పలకాలని బాంబే హైకోర్టు సూచించింది. దాదాపు పదేళ్లుగా కొనసాగుతున్న ఈ వ్యవహారాన్ని ఓ ముగింపునకు తీసుకురావాలని తెలిపింది. ఈ వివాదాన్ని ఇలాగే కొనసాగిస్తే దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం తన ఆస్తులను వినియోగించుకునేందుకు ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు ఇచ్చిన అనుమతిని తప్పుబడుతూ విజయ్ మాల్యా 2020లో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌ను జస్టిస్ మిలింద్ జాదవ్ విచారించారు. ఈడీ జప్తు చేసిన ఆస్తుల ప్రస్తుత పరిస్థితి, దర్యాప్తు పురోగతిపై వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. ఇంకా దీనిని పట్టుకుని కూర్చోకుండా ముందుకు సాగాలని జడ్జి స్పష్టం చేశారు. ఇరుపక్షాలు కూర్చుని ఆచరణాత్మకమైన పరిష్కారం వైపు అడుగులు వేయాలని సూచించారు.

కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కోసం పలు బ్యాంకుల నుంచి మాల్యా దాదాపు రూ.9,000 కోట్ల రుణం తీసుకున్నారు. ఆ రుణాలను చెల్లించకపోవడంతో ఆయనపై కేసులు నమోదయ్యాయి. 2016 మార్చిలో ఆయన భారత్ నుంచి విదేశాలకు పరారయ్యారు. దీంతో 2019లో ఆయన్ను "పరారైన ఆర్థిక నేరస్థుడి"గా ప్రకటించారు. చట్ట ప్రకారం మాల్యా ఆస్తులను జప్తు చేసి రుణాల రికవరీకి చర్యలు చేపట్టారు. దీంతో ఆయన హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించడాన్ని, 2018 ఎఫ్ఈఓ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును తన పిటిషన్లలో ప్రశ్నించారు. ఈ రెండు పిటిషన్లను విచారించాలంటే.. మాల్యా తొలుత భారత న్యాయవ్యవస్థ పరిధిలోకి రావాలని కోర్టు సూచించింది. అయితే, బ్రిటన్ కోర్టుల ఆంక్షల కారణంగా మాల్యా భారత్‌కు ఎప్పుడు వస్తారో చెప్పలేమని ఆయన తరఫు న్యాయవాది తెలిపారు. మరోవైపు, మాల్యాను భారత్‌కు అప్పగించేందుకు వీలుగా బ్రిటన్‌తో కేంద్రం సంప్రదింపులు కొనసాగిస్తోంది.

# హైవే అంబులెన్సులు.. 10 నిమిషాల్లో చేరుకోకుంటే రూ.10వేల పెనాల్టీ

జాతీయ రహదారులపై ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు అత్యవసరంగా స్పందించడంలో జాప్యాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్న జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ .. సంబంధిత నిబంధనలను మరింత కఠినతరం చేసింది. నేషనల్ హైవేలపై మోహరించే అంబులెన్సులు పది కిలో మీటర్ల పరిధిలోని ఏ ప్రమాద స్థలానికైనా పది నిమిషాల్లో చేరుకోవాలని నిర్దేశించింది. లేదంటే ఒక్కో ప్రమాదానికి రూ.10వేల జరిమానా ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అంబులెన్సులు టికెట్ స్వీకరించిన తర్వాత గంటలోపే ప్రమాద బాధితులను సమీపంలోని ఆసుపత్రులకు తీసుకెళ్లాలని పేర్కొంది. నిర్దేశించిన గడువులోగా చేర్చకున్నా రూ.10 వేల పెనాల్టీ ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపింది.

ప్రమాద సంఘటనల నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఎన్‌హెచ్ఏఐ కేర్ సిస్టమ్ (NHAI Care System) తీసుకొచ్చింది. ఇందులో భాగంగా అంబులెన్సులు, క్రేన్లు, పెట్రోలింగ్ వాహనాలు సహా ఆన్‌రోడ్ యూనిట్ల నిర్వహణకు కొత్త నిబంధనలు రూపొందించింది.

నూతన మార్గదర్శకాల ప్రకారం.. సంఘటన జరిగిన ప్రదేశాన్ని బట్టి పది కి.మీ పరిధిలోని ప్రమాద స్థలికి చేరుకునేందుకు 10నిమిషాల కంటే ఎక్కువ సమయం పట్టకూడదు. అంతకన్నా ఎక్కువ దూరం ఉంటే అందుకు అనుగుణంగా కొంత ఎక్కువ సమయం తీసుకోవచ్చు. వాహనానికి ఉండే జీపీఎస్ ద్వారా అధికారులు దీనిని పర్యవేక్షిస్తారు.

ఏదైనా అత్యవసర టికెట్‌ను అంబులెన్సు తిరస్కరించినా రూ.10 వేల జరిమానా పడుతుంది. కాంట్రాక్ట్ ఒప్పందం ప్రకారం అన్ని పరికరాలు, ఔషధాలు, సిబ్బంది ఉండాలి. లేదంటే జరిమానా తప్పదు.

ఎన్‌హెచ్ఏఐ పరిధిలో ప్రస్తుతం 50వేల కి.మీ మేర జాతీయ రహదారులున్నాయి. వీటిపై 3000 అంబులెన్సులు, 1000 పెట్రోలింగ్ వాహనాలు, క్రేన్లు ఉన్నాయి. వీటన్నింటికీ ఏఐఎస్400 కంప్లైంట్ జీపీఎస్ పరికరాలు ఉండడంతోపాటు ఒక్కో వాహనంలో ఐఓటీ సిమ్‌తో కూడిన ఆండ్రాయిడ్ మొబైల్ కూడా ఉంటుంది.

జాతీయ రహదారుల్లో హెల్ప్‌లైన్ కోసం 1033 నంబర్‌ను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ప్రమాదాల వేళ అత్యవసర స్పందనలో జాప్యాన్ని తగ్గించాలని రోడ్డు భద్రతపై సుప్రీం కోర్టు నియమించిన కమిటీతోపాటు కాగ్ (CAG) ఆడిట్ నివేదికలు సూచించిన విషయాన్ని ఎన్‌హెచ్ఏఐ గుర్తుచేసింది.



ఈ నేపథ్యంలో ఈ నూతన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని అందరు ప్రాజెక్టు డైరెక్టర్లు, రీజినల్ ఆఫీసర్లకు ఎన్‌హెచ్ఏఐ స్పష్టం చేసింది. అలసత్వం వహిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది.

# నా సూచనలు పట్టించుకోలేదు.. అందుకే పార్టీ మారా హర్భజన్ సింగ్

ఆమ్ ఆద్మీ పార్టీ లో తన మాటకు విలువ లేకపోవడంతోనే భాజపాలో చేరినట్లు మాజీ క్రికెటర్, రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్ తెలిపారు. క్రీడల అభివృద్ధి కోసం పనిచేయాలనే ఉద్దేశంతోనే ఆప్‌లో చేరానని.. తన సూచనలు పార్టీ పెద్దలు పట్టించుకోకపోవడంతో బయటకు రావాల్సి వచ్చిందని ఓ పాడ్‌కాస్ట్‌లో చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో హర్భజన్‌తోపాటు మరో ఆరుగురు ఆప్ ఎంపీలు భాజపాలో చేరిన విషయం తెలిసిందే.



"రాజ్యసభలో ఆప్ తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు పంజాబ్ సీఎం భగవంత్ మాన్ నన్ను పార్టీలోకి ఆహ్వానించారు. ఆ సమయంలో క్రీడలకు సంబంధించిన అంశాలను మాత్రమే ప్రస్తావిస్తానని ఆయనతో చెప్పాను. రాజకీయాల గురించి మాట్లాడనని స్పష్టం చేశా. పంజాబ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించేందుకు అవకాశం రావడంతోనే ఆప్‌లో చేరా. కానీ నా ఆలోచనలను ఎవరూ పట్టించుకోలేదు. కనీసం ఒక్క సూచననైనా అమలు చేసి ఉంటే పార్టీని వీడేవాడిని కాదు" అని హర్భజన్ చెప్పారు. పార్టీని వీడిన తర్వాత ఆప్ తనను విమర్శించడాన్ని ఆయన తప్పుబట్టారు. తన ఇంటి వద్ద నిరసనలు చేపట్టి దిష్టి బొమ్మను దహనం చేయడంపై స్పందిస్తూ.. "నేను ఎవరిని మోసం చేశాను? దేశ ప్రజలు నన్ను క్రికెట్ కారణంగా ప్రేమించారు. పంజాబ్ కోసం మీరు ఏం చేశారో చెప్పాలి. నన్ను ద్రోహి అని పిలిచినంత మాత్రాన నేను ద్రోహిని కాను" అని అన్నారు.

**మత్తుతో యువత భవిష్యత్తు నాశనం..**

పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్య తీవ్రంగా ఉందని హర్భజన్ ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయన్నారు. ఒకప్పుడు క్రీడల్లో పంజాబ్ అగ్రస్థానంలో ఉండేదని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పంజాబ్‌లోని ఓ చిన్న గ్రామం నుంచి ఒకప్పుడు తొమ్మిది మంది హాకీ ఆటగాళ్లు జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. ప్రస్తుతం మాదకద్రవ్యాలు విపరీతంగా పెరగడంతో యువత తీవ్రంగా నష్టపోతోందన్నారు.

# నా ప్రసంగం తర్వాత శుద్ధి చేశారు: రాజ్యసభలో ఖర్గే వ్యాఖ్యలు

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరిరోజున ఎగువ సభలో గందరగోళం నెలకొంది. ఉత్తరాఖండ్ ర్యాలీలో భాగంగా తన ప్రసంగం తర్వాత వేదిక వద్ద శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టారంటూ రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై వెంటనే కేంద్రమంత్రి జేపీ నడ్డా స్పందించారు. అదొక దురదృష్టకర ఘటన అని, అటువంటి కార్యక్రమాలను భాజపా ఏమాత్రం సమర్థించబోదని స్పష్టం చేశారు.

ఇటీవల ఉత్తరాఖండ్‌లోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన బహిరంగ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. రెండురోజుల తర్వాత ఒక గ్రూప్ అక్కడ శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో గురువారం రాజ్యసభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే.. ఖర్గే ఈ విషయాన్ని లేవనెత్తారు. "నేను పాల్గొన్న ర్యాలీలో లక్షల మంది హాజరయ్యారు. నేను ఏ వర్గాన్ని గానీ, మతాన్ని గానీ ప్రస్తావించలేదు. ప్రజల సమస్యల గురించి మాత్రమే మాట్లాడాను. కానీ ప్రసంగం తర్వాత కొందరు అడిగారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి పరిస్థితా..? ఇది భాజపా కార్యకర్తల పనే" అని తీవ్ర ఎంపీలు నినాదాలు చేశారు. రాజ్యసభ ఛైర్మన్ కలుగజేసుకొని వారికి సర్దిచెప్పారు. ఈ ప్రపంచంలో అంటరానితనానికి మించిన పాపం లేదన్నారు. ఇందులో రెండో అభిప్రాయానికి తావులేదని, వారిని పట్టుకోవాలని ఛైర్మన్ సూచించారు.



అయితే, భాజపా కార్యకర్తల పనంటూ ఖర్గే చేసిన ఆరోపణలను జేపీ నడ్డా ఖండించారు. ఆ వ్యవహారంతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. "భాజపా చేసిందని పదేపదే చెప్పొద్దు. మా పార్టీ అలాంటి వాటిని ప్రోత్సహించదు. ఆ ఘటనపై దర్యాప్తు జరిపిస్తాం" అని హామీ ఇచ్చారు.

# అకాలీదళ్ చీఫ్ సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై దాడి

శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు, పంజాబ్ మాజీ ఉపముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్ పై దాడి జరిగింది. మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా ఉన్న గురుద్వారా సమీపంలో ఓ వ్యక్తి ఆయనపై పదునైన ఆయుధంతో దాడి చేశాడు. దీంతో బాదల్ కుడి చేతికి గాయమైంది. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

దాడి జరిగిన సమయంలో బాదల్ సతీమణి, అకాలీదళ్ ఎంపీ హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ సైతం ఆయన వెంటే ఉన్నారు. ఈ ఘటనలో బాదల్ భద్రతా సిబ్బంది కూడా గాయపడినట్లు సమాచారం. 2024 డిసెంబర్‌లోనూ బాదల్‌పై ఓసారి హత్యాయత్నం జరిగింది. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం వెలుపల ఓ వ్యక్తి ఆయనపై కాల్పులు జరిపారు. అయితే, బుల్లెట్ గురితప్పడంతో ఈ ఘటన నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. దుండగుడిని పోలీసులు అక్కడికక్కడే అరెస్టు చేశారు. పంజాబ్ మాజీ సీఎం ప్రకాశ్‌సింగ్ బాదల్ తనయుడే సుఖ్‌బీర్ సింగ్ బాదల్. 2009 నుంచి 2017 వరకు రెండు పర్యాయాలు పంజాబ్ ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. సుఖ్‌బీర్‌పై దాడి విషయం తెలుసుకున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్.. నాందేడ్ ఎస్పీతో మాట్లాడారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఆదేశించారు. మరోవైపు, తమ చీఫ్‌పై దాడిని శిరోమణి అకాలీదళ్ తీవ్రంగా ఖండించింది.



# రూ.500 లంచం ఇచ్చినందుకు బాధపడ్డ ఐపీఎస్.. రూ.కోటి అవినీతి కేసులో ఇరుక్కుని..!



సివిల్ సర్వీసెస్ అభ్యర్థిగా ఉన్నప్పుడు రూ.500 లంచం ఇవ్వాల్సి వచ్చిందని బాధపడిన వ్యక్తి.. ఉద్యోగం సాధించాక రూ.కోటి లంచం తీసుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఛత్తీస్‌గఢ్ క్యాడర్‌కు చెందిన ట్రైనీ ఐపీఎస్ అధికారి రాహుల్ బన్సాల్‌పై ఈ ఆరోపణలు వచ్చాయి. బాధితులు ఇందుకు సంబంధించిన డిజిటల్ ఆధారాలు కూడా సమర్పించినట్లు తెలుస్తోంది. దీంతో ఈ వ్యవహారం దిల్లీలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానికి చేరింది. ఐపీఎస్‌గా ఎంపికైన తర్వాత రాహుల్ బన్సాల్ ఛత్తీస్‌గఢ్‌లోని సుర్గుజా జిల్లాలో సీఎస్పీగా విధుల్లో చేరారు. ఆ సమయంలో ఓ సైబర్ నేరానికి సంబంధించిన సెటిల్‌మెంట్‌లో భాగంగా ఆయన రూ.కోటి లంచం తీసుకున్నట్లు బాధితులు పేర్కొన్నారు. రెండు దఫాలు ఈ మొత్తాన్ని ఆయనకు బదిలీ చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన వాట్సప్ రికార్డులు, ఇతర డిజిటల్ ఆధారాలను వారు సమర్పించారు. వీటిని పరిశీలించిన న్యాయస్థానం.. ఘటనపై నివేదిక ఇవ్వాలని ఛత్తీస్‌గఢ్ పోలీసులను ఆదేశించింది. కాగా.. సివిల్ సర్వీసెస్‌లో చేరకముందు రాహుల్ ఇచ్చిన మాక్ ఇంటర్వ్యూ వీడియో ఒకటి ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

"నా సోదరుడు అమెరికా వెళ్లేందుకు జనన ధ్రువీకరణ పత్రం అత్యవసరంగా అవసరమైంది. దాన్ని త్వరగా ఇచ్చేందుకు పంచాయతీ అధికారి రూ.500 లంచం అడిగారు. ఆ మొత్తం చెల్లించడం నాకు చాలా బాధగా అనిపించింది" అని బన్సాల్ చెప్పినట్లు ఆ వీడియోలో ఉంది. అదే ఇంటర్వ్యూలో అవినీతి, అసమర్థతపై బన్సాల్ మాట్లాడారు. కొందరు అధికారులు చేసే తప్పులకు అందరినీ బాధ్యులను చేయడం సరికాదన్నారు. ఇప్పుడు ఆయనపై రూ.కోటి లంచం ఆరోపణలు రావడంతో నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే, రాహుల్‌పై వచ్చిన ఆరోపణలపై ఛత్తీస్‌గఢ్ పోలీసుల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

# మురికి కాలువల నుంచే బొద్దింకలు వస్తాయి.. నా వ్యాఖ్యల్లో తప్పేముంది:



జెన్ జీపై ఎంపీ కంగనారనౌత్ చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం రేపాయి. తాజాగా తన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. తన కామెంట్స్ దేశంలోని యువత మొత్తాన్ని ఉద్దేశించినవి కావని.. కొందరు వ్యక్తులను మాత్రమే ఉద్దేశించి అన్నట్లు ఆమె స్పష్టం చేశారు.

"తమను తాము బొద్దింకలు అని అభివర్ణించుకునే వారి గురించి మాత్రమే నేను మాట్లాడాను. బొద్దింకలు మురికి కాలువల నుంచే వస్తాయి కదా, అలాంటప్పుడు నేను అన్న మాటల్లో తప్పేముంది? నా పాయింట్ చాలా స్పష్టంగా ఉంది. కొందరు తమను తాము బొద్దింకలు అని చెబుతుండే.. మురికికాలువే వారి ఇల్లు అని మనం అంటే వారు ఎందుకు కోప్పడాలి? నేను యువత మొత్తాన్ని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేశానని అనడం సరికాదు" అని చెప్పారు.

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై జెన్‌జీ నిరసనకారులకు సంబంధించిన వీడియోలను ఉద్దేశించి గతంలో కంగనా ఈ కామెంట్స్ చేశారు. జెన్‌జీ అంటే 'గట్టర్ జనరేషన్' అని ఆమె పేర్కొన్నారు. "నా జీవితంలో ఒకే దగ్గర ఇంత కంపును ఎప్పుడూ చూడలేదు. జెన్ జీ నిరసనకారుల రీల్స్ వాంతులు తెప్పించేలా ఉన్నాయి. వారు మాట్లాడే విధానం, వాడే భాష నేనెప్పుడూ చూడలేదు" అంటూ సామాజిక మాధ్యమం వేదికగా విరుచుకుపడ్డారు.

# ఎర్రకోట బాంబు పేలుడు అల్-ఖైదా పనే..!



దేశ రాజధాని దిల్లీలోని ఎర్రకోట వద్ద గతేడాది నవంబరులో జరిగిన పేలుడుకు అల్‌ఖైదా అనుబంధ సంస్థ కారణమని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ధ్రువీకరించింది. ఈ దాడితో 'అల్‌ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్‌కాంటినెంట్ 'కు సంబంధం ఉందని పేర్కొంది. ఈ మేరకు దీనిపై నివేదిక విడుదల చేసింది. ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో సుమారు 15 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఏక్యూఐఎస్ గతంలో చిన్న బృందంగా ఉండేదని.. ప్రస్తుతం ప్రాంతీయ ఉగ్రవాద సంస్థగా రూపాంతరం చెందుతోందని ఐరాస భద్రతా మండలి తన నివేదికలో తెలిపింది. అల్‌ఖైదా, ఐసిస్ సంస్థలు రసాయన, జీవ ఆయుధాల తయారీపై చాలాకాలంగా ఆసక్తి చూపుతున్నాయని పేర్కొంది. భారతదేశ సరిహద్దుల్లో ఉన్న బంగ్లాదేశ్‌ను స్థావరం చేసుకొని, అక్కడ తమ ముఠాలను బలోపేతం చేయడానికి AQIS తీవ్రంగా ప్రయత్నిస్తోంది వెల్లడించింది.

# పరదేశీ.. కాంగ్రెస్.. పంజాబీ.. నమ్మండీ.. ఇవీ పేర్లేనండీ



'విదేశీ', 'పరదేశీ', 'అంగ్రేజ్', 'కాంగ్రెస్', 'పంజాబీ'.. ఇవన్నీ వ్యక్తుల పేర్లే! మనం నమ్మి తీరాల్సిందే!! ఎవరైనా జాతకం ప్రకారమో, సెంటిమెంట్‌తోనో.. తమ సంతానానికి పేర్లు పెట్టుకుంటారు. బిహార్‌లోని గయా జిల్లా ఆమస్ పంచాయతీ భూప్‌నగర్ గ్రామానికి చెందిన మాంఝీ కుటుంబ పెద్దలు మాత్రం.. తాము చూసిన, విన్న విషయాల ఆధారంగా పేర్లు పెడుతుంటారు. దీని వెనక ఉన్న కథను 80 ఏళ్ల గులాటీ మాంఝీ వివరించారు. 'మా పూర్వీకులు అడవిని ఆనుకొని ఉన్న గ్రామాల్లో నివసించేవారు. వాళ్లకి పిల్లలకు పేర్లు పెట్టాలనే అవగాహన ఉండేది కాదు.

చిన్నప్పుడు నేను పాములాగా దొర్లేవాడినని 'గులాటీ' అనే పేరు పెట్టారు. ఏదైనా భాష, రాజకీయ పార్టీ, ఆసక్తికరంగా ఉన్న పదాలు వినగానే అవే పెట్టేవాళ్లు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో బ్రిటిష్ వారిని ఉద్దేశించి వాడే 'విదేశీ' అనే పదాన్ని విని మా తాత మా తండ్రికి పెట్టారు. మా సోదరుడు వేరే రాష్ట్రంలో పుడితే 'పరదేశీ' అన్నారు. తర్వాత ఇదే ఆనవాయితీ కొనసాగుతోంది' అని చెప్పుకొచ్చారు. ఆధార్, రేషన్ ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డుల్లోనూ ఈ విచిత్రమైన పేర్లు ఇలాగే నమోదయ్యాయి.

# త్వరలో 'జంతర్ మంతర్ సీజన్ 2'.. మరో ఉద్యమంపై దీప్కే ప్రకటన

శ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద 36 రోజుల పాటు ఆందోళన నిర్వహించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) మరో నిరసనకు సిద్ధమవుతోంది. ఈసారి విద్య, ప్రజా సమస్యలపై దృష్టి పెడుతూ దేశవ్యాప్తంగా 'ప్రజల మాట విందాం యాత్ర'ను చేపట్టబోతున్నట్లు ప్రకటించింది. దీనిని 'జంతర్ మంతర్ సీజన్ 2' గా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అభివర్ణించారు. ఈ ఆందోళనను ఎప్పుడు ప్రారంభిస్తారంటూ సోషల్ మీడియాలో సందేశాలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. త్వరలోనే జంతర్ మంతర్ సీజన్ 2ను ప్రారంభించబోతున్నామని స్పష్టం చేశారు. దిల్లీలో బుధవారం తలపెట్టిన సీజేపీ వాలంటీర్ల సమావేశం రద్దు అనంతరం దీప్కే ఈ ప్రకటన చేశారు. భాజపా ఒత్తిడితోనే భేటీ నిర్వహించాల్సిన నారాయణలోని సమావేశ మందిరం బుకింగ్‌ను చివరి నిమిషంలో రద్దు చేశారని ఆరోపించారు.

**సీజేపీలోని వ్యక్తుల కార్యకలాపాలపై దర్యాప్తు కోరుతూ పిటిషన్**

నకిలీ న్యాయవాదులు, బూటకపు లా డిగ్రీలు, సీజేపీతో అనుసంధానమైన వ్యక్తుల కార్యాకలాపాలపై దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కేంద్రం, సీబీఐ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)ల స్పందనకు సుప్రీంకోర్టు ఆదేశించింది. న్యాయవాది రాజా చౌధరీ ఈ పిటిషన్ దాఖలు చేయడంతో పాటు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహన ధర్మాసనం ముందు హాజరై వాదనలు వినిపించారు.

# డాక్టర్ కొండయ్య కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి పల్లె



- డాక్టర్ కొండయ్య మృతి అత్యంత బాధాకరం
- కొండయ్య నివాసానికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించిన మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

**అనంతపురం ఆగస్ట్ 13 అనంత జనశక్తి న్యూస్**

అనంతపురంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కొండయ్య మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు.డాక్టర్ కొండయ్య మృతి పట్ల మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వైద్య రంగంలో డాక్టర్ కొండయ్య అందించిన సేవలు అభినందనీయమని, ఆయన మృతి కుటుంబ సభ్యులతో పాటు సమాజానికి తీరని లోటని అన్నారు.డాక్టర్ కొండయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, డాక్టర్ కొండయ్య ఆత్మకు శాంతి చేకూరాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆకాంక్షించారు. మాజీ మంత్రి తో పాటు పలువురు కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# మహిళలకు రూ.50,000



- సంచలన నిర్ణయం దిశగా యోగి సర్కార్
- ఎన్నిలక ముందు బీజేపీ వరాల జల్లు

**న్యూఢిల్లీ,ఆగస్ట్ 13, అనంత జనశక్తి న్యూస్**

ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ముందు యోగి ఆదిత్యనాథ్ సర్కార్ తన పథకాలను విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది. ప్రభుత్వం మహిళలకు రూ. 50,000 వరకు ఆర్థిక సాయం అందించాలని యోచిస్తోంది. అయితే, ఈ మొత్తాన్ని ఒకేసారి నగదు రూపంలో ఇవ్వాలా? లేక ఇప్పటికే అమలులో ఉన్న మహిళా సంక్షేమ పథకాలను విస్తరించి వివిధ రూపాల్లో ప్రయోజనం కల్పించాలనా? అనే ఆలోచన చేస్తోంది. అర్హత కలిగిన మహిళల బ్యాంకు ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా నేరుగా నగదు జమ చేయాలనే ఒక ప్రతిపాదన ఉంది. మరో మార్గంగా విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాలకు సంబంధించిన పథకాల ద్వారా ఆర్థిక ప్రయోజనం అందించే అంశాన్ని పరిశీలిస్తోంది. రూ. 50,000 మొత్తాన్ని ఒకేసారి నగదు రూపంలో ఇవ్వకుండా, ఇప్పటికే అమలులో ఉన్న మహిళా సంక్షేమ పథకాలను మరింత విస్తరించే అవకాశం కూడా ఉంది.

యూపీలో అమలు అవుతున్న మహిళా సంక్షేమ పథకాలు ఇవే:

ముఖ్యమంత్రి కన్యా సుమంగళ యోజన: పుట్టుక నుంచి విద్యలో వివిధ దశలు, గ్రాడ్యుయేషన్ వరకు అర్హత కలిగిన బాలికలకు మొత్తం రూ.15,000 వరకు ఆర్థిక సాయం.

*రాణి లక్ష్మీబాయి స్కూటీ యోజన: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ప్రతిభావంతులైన విద్యార్థినులకు స్కూటర్లు అందించే లక్ష్యంతో ఉన్న పథకం.

*నిరాశ్రిత మహిళా పెన్షన్ యోజన: అర్హత కలిగిన నిరాశ్రయ మహిళలు, వితంతువులకు జీవనోపాధి కోసం ప్రతి మూడు నెలలకు రూ.3,000 సాయం.

*రాణి లక్ష్మీబాయి మహిళా ఏవం బాల్ సమ్మాన్ కోష్: యాసిడ్ దాడులు సహా తీవ్రమైన హింసకు గురైన మహిళలు, పిల్లలకు చికిత్స, పునరావాసం కోసం ఆర్థిక సాయం.

*ముఖ్యమంత్రి సామూహిక వివాహ యోజన: పేద, నిరాశ్రయ కుటుంబాల కుమార్తెలు, వితంతు మహిళల కుమార్తెల వివాహాలకు ఆర్థిక సహాయం.


*స్వయం సహాయక సంఘాలు, లఖ్‌పతి దీదీ: మహిళలను స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాలు, జీవనోపాధి అవకాశాలతో అనుసంధానించి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చేయడం.

*యూపీ రోడ్‌వేస్ ఉచిత ప్రయాణం: 60 ఏళ్లు పైబడిన మహిళలకు ఉత్తరప్రదేశ్ రోడ్‌వేస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం.

# బంగ్లాదేశ్‌లో తీవ్ర విద్యుత్ సంక్షోభం

- భారత్ సాయం కోసం ఎదురుచూపు
- గ్రామీణ ప్రాంతాల్లో 8–16 గంటల వరకు కోతలు

**న్యూఢిల్లీ,ఆగస్ట్ 13, అనంత జనశక్తి న్యూస్**



బంగ్లాదేశ్ తీవ్ర విద్యుత్ సంక్షోభంతో అల్లాడుతోంది. దేశవ్యాప్తంగా 1016 గంటల పాటు విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయి. విద్యుత్ కోతల కారణంగా దేశవ్యాప్తంగా దుకాణాలు, మార్కెట్లు, షాపింగ్ మాల్స్‌ను రాత్రి 8 గంటల వరకు మాత్రమే తెరిచి ఉంచాలని ప్రభుత్వం కొత్త నిబంధనల్ని అమలు చేస్తోంది. విద్యుత్ కొరత కారణంగా ఇకపై బంగ్లాదేశ్‌లోని దుకాణాలు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే తెరిచి ఉంటున్నాయి. దేశంలోని అన్ని బిల్ బోర్డులను సాయంత్రం 7 గంటల లోపు ఆపేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అన్ని డెకరేషన్ లైట్లు కూడా పూర్తిగా నిలిపేయాలని చెప్పింది. బంగ్లాదేశ్ విద్యుత్, ఇంధన మరియు ఖనిజ వనరుల మంత్రిత్వ శాఖ బుధవారం సాయంత్రం జారీ చేసిన ఒక ఉత్తర్వులో ఈ నిర్ణయాలను ప్రకటించింది.

**విద్యుత్ కొరత ఎందుకు?**

బంగ్లాదేశ్‌కు వచ్చే ఇంధనం దాదాపుగా గల్ఫ్ దేశాల నుంచే వస్తోంది. ఇరాన్అమెరికా యుద్ధం వల్ల హార్ముజ్ జలసంధి మూతపడింది. బంగ్లాదేశ్‌లో విద్యుత్ ఉత్పత్తి గ్యాస్‌పై ఆధారపడి ఉంది. గ్యాస్ కొరత కారణంగా విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు భారత్ గతంలో 5000 మెట్రిక్ టన్నుల డీజిల్ పంపింది. కొన్నాళ్ల పాటు ఈ సాయంతో నెట్టుకొచ్చింది. 33092 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం ఉన్నప్పటికీ, ఇంధన కొరత కారణంగా అందులో సగభాగాన్ని మాత్రమే ఉత్పత్తి చేయగలుగుతోంది.

భారత సాయం కోసం బంగ్లా చూపు..

సంక్షోభాన్ని అధిగమించడానికి బంగ్లాదేశ్ భారత్‌ను కోరింది. గత వారం గత వారం భారత హైకమిషనర్ దినేశ్ త్రివేదితో బంగ్లాదేశ్ ఇంధన మంత్రి ఇక్బాల్ హసన్ మహ్మూద్ సమావేశమైన సందర్భంగా ఈ అభ్యర్థన చేశారు.భారత్ నుంచి డీజిల్ సరఫరా కోసం ఇప్పటికే పైప్‌లైన్ ఉందని, దాని ద్వారా మరింత డీజిల్ అందించాలని మంత్రి కోరారు. ఇండియా-బంగ్లాదేశ్ ఫ్రెండ్‌షిప్ పైప్‌లైన్ 2017లో షేక్ హసీనా ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభమైంది. బంగ్లాదేశ్ ఇంధన భద్రతలో ఈ పైప్‌లైన్ కీలక పాత్ర పోషిస్తోంది. 15 ఏళ్ల ఒప్పందం ప్రకారం భారత్ ప్రతి సంవత్సరం 1,80,000 మెట్రిక్ టన్నుల డీజిల్‌ను ఢాకాకు పంపాల్సి ఉంది. మిడిల్ ఈస్ట్ సంక్షోభం సమయంలో మార్చి, ఏప్రిల్ నెలల్లో భారత్ ఇప్పటికే 30,000 టన్నులకు పైగా డీజిల్‌ను బంగ్లాదేశ్‌కు పంపింది.

# హర్ ఘర్ తిరంగా ర్యాలీని జయప్రదం చేయాలి

- ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం ఆగస్ట్ 13 అనంత జనశక్తి న్యూస్**



80,వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 14 ,వ తేదీ ఉదయం 8:00 గంటలకు అనంతపురం పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు నిర్వహించే

'హర్ ఘర్ తిరంగా' ర్యాలీలో ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థలు, పుర ప్రముఖులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, క్రీడాకారులు,విద్యార్థిని, విద్యార్థులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఓ .ఆనంద్ కలెక్టర్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు .ఈ ర్యాలీలో ప్రజలు పాఠశాల, కళాశాలల విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సేవా సంస్థలు, పాల్గొని పొడవైన జాతీయ జెండాను ప్రదర్శిస్తూ, దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమం జిల్లాలోని అన్ని మండల , గ్రామ వార్డు స్థాయిలలో తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా స్థానిక ప్రజాప్రతినిధులను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేయాలని మండల స్థాయి అధికారులకు, మున్సిపల్ కమిషనర్లకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ జాతీయ జెండాలను చేత బూని దేశభక్తిని చాటాలని అలాగే అన్ని వర్గాల ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని తెలిపారు. అపార్ట్మెంట్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పరిశ్రమలు, షాపులు తదితర ప్రాంతాల్లోని ప్రజలు వారి వారి ఆవాసాలపై జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. దీనికి సంబంధించి చేపట్టిన కార్యక్రమాల ఫోటోలు, వీడియోలు జిల్లా కంట్రోల్ రూమ్ తో పాటు నోడల్ ఆఫీసర్ ఈమెయిల్ (anantapur. apta@ gmail.com కు పంపాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు జాతీయ జెండాతో సెల్ఫీలు తీసుకుని హర్ ఘర్ తిరంగా వెబ్సైట్ నందు ఫోటోలు అప్లోడ్ చేయాలన్నారు. జిల్లా అధికారులు కూడా ఆయా కార్యక్రమాలను పై తెలిపిన విధంగా పంపాల్సి ఉంటుందన్నారు.

ఈ సందర్భంగా జిల్లా అధికారులు వారి కింది స్థాయి సిబ్బందికి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు తెలియజేసి పలు సూచనలు సలహాలు ఇచ్చి హర్ హర్ తిరంగా కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.,

# పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా ఓరియంటేషన్ (పరిచయ కార్యక్రమం)




**అనంతపురం ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్**

పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల, అనంతపురంలో 2026-27 విద్యా సంవత్సరంలో బీటెక్‌లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఓరియంటేషన్ (పరిచయ కార్యక్రమం) గురువారం ఘనంగా నిర్వహించారు. నూతన విద్యార్థులకు కళాశాల విద్యా విధానం, క్రమశిక్షణ, సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ అవకాశాలపై కార్యక్రమంలో అవగాహన కల్పించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ, సాంకేతిక విద్యలో క్రమశిక్షణతో కూడిన ప్రామాణిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని అన్నారు. పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య, అవసరమైన సౌకర్యాలు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలో లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకుని విద్యార్థులందరూ ఉజ్వల భవిష్యత్తును సాధించాలని ఆకాంక్షించారు.కళాశాల చైర్మన్ డా. కిషోర్ పల్లె మాట్లాడుతూ, 2026-27 విద్యా సంవత్సరంలో బీటెక్‌లో చేరిన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు కళాశాల ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ డా. పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు బీటెక్ విద్యను కేవలం డిగ్రీగా కాకుండా తమ భవిష్యత్‌కు బలమైన పునాదిగా భావించాలని సూచించారు. మొదటి సంవత్సరం నుంచే సాంకేతిక నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కళాశాల యాజమాన్యం అన్ని విధాలుగా సహకరిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, కేరళ మాజీ డీజీపీ శంకర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రమేష్ బాబు, డీన్ డా. సంతోష్ కుమార్ రెడ్డి, ఏవో డా. మనోహర్ రెడ్డి, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి డా. లక్ష్మి నరసప్ప, అధ్యాపకులు, సిబ్బంది, 2026-27 విద్యా సంవత్సరంలో బీటెక్‌లో చేరిన నూతన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మరణాలను 70 %వరకు తగ్గించగలిగాం

(మొదటి పేజీ తరువాయి)

పలమనేరు, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో మానవఏనుగు సంఘర్షణ సమస్యను పరిష్కరించేందుకు కర్ణాటకతో కలిసి చర్యలు చేపట్టాం. కర్ణాటక నుంచి నాలుగు కుంకీలను తీసుకువచ్చి ముసలివాగులో ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేశాం. కుంకీల సహాయంతో 50కి పైగా సంఘర్షణ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించి, ఏనుగుల వల్ల జరిగే మానవ మరణాలను 70 శాతం వరకు తగ్గించగలిగాం. రాష్ట్ర ప్రభుత్వం 'హనుమాన్' కార్యక్రమంలో భాగంగా ర్యాపిడ్ రెస్పాన్స్ వాహనాలు, ఏడు వన్యప్రాణుల అంబులెన్స్‌లను ఏర్పాటుచేసింది. వీటిద్వారా 200కు పైగా వన్యప్రాణులను రక్షించగా, 30కుపైగా ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించారు. ఏనుగుల సంరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యంతో కూడిన ఉద్యమంగా మారాలి'' పవన్ పిలుపునిచ్చారు.

**ఏపీలో 132 నుంచి 142 అడవి ఏనుగులు..**

ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 132 నుంచి 142 అడవి ఏనుగులు ఉన్నాయని పవన్ కల్యాణ్ వెల్లడించారు. వాటి సంరక్షణ మనకు గర్వకారణమే కాకుండా బాధ్యత కూడా అని తెలిపారు. మనిషి – ఏనుగు ఘర్షణలను తగ్గించేందుకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక అటవీ శాఖల మధ్య సహకారం కొనసాగుతోందని తెలిపారు. కర్ణాటక అటవీ శాఖ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌కు నాలుగు కుంకీ ఏనుగులు అందాయని ప్రస్తావించారు. వాటి కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. కుంకీ ఏనుగుల సహాయంతో ఇప్పటికే 15 మనిషి – ఏనుగు ఘర్షణ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించామని వెల్లడించారు. దీంతో ఏనుగుల కారణంగా జరిగే మానవ ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో మనిషి – వన్యప్రాణుల ఘర్షణల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు.





**వన్యప్రాణుల రక్షణ కోసం వంద ప్రత్యేక వాహనాలు..**

వన్యప్రాణుల రక్షణ కోసం వంద ప్రత్యేక వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చామని పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఇప్పటివరకు 200కు పైగా వన్యప్రాణులను రక్షించామని చెప్పారు. రైతులకు సకాలంలో హెచ్చరికలు అందించడం, అటవీ సిబ్బందికి ఆధునిక పరికరాలు, శిక్షణ కల్పించడం, వన్యప్రాణులకు సురక్షితమైన ఆవాసాలు కల్పించడం తమ ప్రధాన లక్ష్యాలని వ్యాఖ్యానించారు. వన్యప్రాణుల సంరక్షణ ప్రభుత్వం ఒక్కదాని బాధ్యత కాదని.. ప్రజలను భాగస్వామ్యం చేసి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలని సూచించారు. ఏనుగుల సంరక్షణపై దేశవ్యాప్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో 21,450 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వారి ఉత్సాహం, చైతన్యాన్ని అభినందిస్తున్నామని అన్నారు. అభివృద్ధికి బాధ్యత ఉండాలి, సంరక్షణకు లక్ష్యం ఉండాలని తెలిపారు. వన్యప్రాణులను సురక్షితంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# తొలి వేతనాన్ని అమరవీరుల కుటుంబాలకు

- ఎంపీ -చింతకాయల విజయ్
- నూతనంగా రాజ్యసభ ఎంపీగా విజయ్
- 3 లక్షల చెక్కును రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్‌కు

**న్యూఢిల్లీ,ఆగస్ట్ 13, అనంత జనశక్తి న్యూస్**



దేశాన్ని కాపాడటం కోసం అమరులైన జవాన్ల కుటుంబాలకు ఎంపీ చింతకాలయ విజయ్ అండగా నిలిచారు. ఏపీ నుంచి ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ఎంపికైన చింతకాలయ విజయ్ తన మొదటి జీతాన్ని అమరవీరుల కుటుంబాలకు అందించాలని నిర్ణయించారు. తనకొచ్చిన మొదటి నెల జీతం మూడు లక్షల రూపాయలను దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులైన ఆర్మీ జవాన్ల కుటుంబాల సంక్షేమం కోసం విరాళంగా అందించారు. విరాళంగా అందించిన ఆ చెక్కును భారత రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్‌కు అందజేశారు.

దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తూ, ప్రాణత్యాగాలు చేసిన సైనికుల కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. తనవంతు సాయంగా తన మొదటి జీతాన్ని అమరవీరుల కుటుంబాలకు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. పదవి చేపట్టిన వెంటనే తొలి వేతనాన్ని సైనికుల కుటుంబాల కోసం వెచ్చించడంతో విజయ్‌ను పలువురు నెటిజన్లు ప్రశంసించారు.

**అమరావతి పేరును మారవడంపై విమర్శలు**

రాజ్యాంగ విలువలు తెలియని వ్యక్తి, అమరావతి పేరును మావిగన్‌గా మార్చాలి అనుకుంటున్నారని టీడీపీ ఎంపీ చింతకాయల విజయ్ రాజ్యసభలో వ్యాఖ్యలు చేశారు. కేరళ పేరును కేరళంగా మార్చి కేంద్ర ప్రభుత్వం ఆ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించింది. ఇదివరకు అమరావతి బిల్లును పాస్ చేసి చట్టబద్ధత కల్పించిందని.. కానీ ఇప్పుడు ఆపేరును మావిగన్‌గా మారుస్తాను అనడంపై ఆయన విమర్శలు చేశారు. పార్లమెంట్ ఒకసారి బిల్లు పాస్ చేసిన తర్వాత దానికి వ్యతిరేకంగా ఎవరూ వెళ్లడానికి వీల్లేదని, కానీ రాజ్యాంగం విలువలపై నమ్మకం లేని వారు దానికి వ్యతిరేకంగా మాట్లాడతారని ఆయన పేర్కొన్నారు.

ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ ఉత్తమ ర్యాంకులు తెచ్చుకున్న విద్యార్థుల ఫొటోలను పత్రికల మొదటి పేజీల్లో ప్రచురించడాన్ని ఆయన రాజ్యసభలో ప్రశంసించారు. పేద విద్యార్థుల విజయగాథలను పత్రికల మొదటి పేజీల్లో ప్రకటనలు ఇవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి పథకాన్ని ప్రారంభించాలని రాజ్యసభ జీరో అవర్‌లో ప్రస్తావించారు.

# హిందూ, ముస్లింలు నా రెండు కళ్లు

(మొదటిపేజీ తరువాయి)

మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యాలను పెంచుకుని జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాలు దక్కించుకోవాలని, అందుకోసమే స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని సూచించారు. కొందరు 'SIR' పేరుతో ఓట్లు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని, బెంగాల్‌లో లాగా తెలంగాణలో కూడా గెలుస్తామని మాట్లాడుతున్నారని హెచ్చరించారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్తా ఒక రేవంత్ రెడ్డిగా మారి ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాలని పిలుపునిచ్చారు.

**మీరు కొనుకున్న భూమి ఎక్కడికీ పోదు: రేవంత్**

ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ శంకుస్థాపన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి KPHB కాలనీలో ప్రసంగిస్తూ ఇళ్ల నిర్మాణం, భూక్రమబద్ధీకరణపై ప్రజలకు హామీ ఇచ్చారు. భూమికి సంబంధించిన డబ్బులు ఏమీ తీసుకోవడం లేదని, ఇల్లు పూర్తయిన తర్వాత మాత్రమే రూ. 5 లక్షలు చెల్లించాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా, రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా మినహాయిస్తున్నట్లు ప్రకటించారు. 22A నిబంధనల కింద ఉన్న భూములకు తనదే పూర్తి భరోసా అని, కోర్టు కేసులు ఉన్నవి మినహా మిగిలిన భూములన్నింటినీ రిజిస్ట్రేషన్ చేయిస్తానని సీఎం హామీ ఇచ్చారు. ంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కూకట్‌పల్లిని ప్రత్యేకంగా చూసి అభివృద్ధి చేస్తానని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. పైసా ఖర్చు లేకుండా తనను ఎంపీగా గెలిపించిన కూకట్‌పల్లి ప్రజల రుణం తీర్చుకునే అవకాశం ఇప్పుడు వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే హౌసింగ్ బోర్డు కాలనీలు నిర్మితమయ్యాయని గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, కేసీఆర్‌ను తీవ్రంగా విమర్శించిన ఆయన.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఊరవతల ఇళ్లు కట్టి ప్రజలను ఉపాధికి దూరం చేశారని ధ్వజమెత్తారు. పదేళ్ల కేసీఆర్ పాలనకు, తమ ప్రభుత్వం పూర్తి చేసిన పనులకు మధ్య ఉన్న తేడాను ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు గానూ తమ ప్రభుత్వం నెలకు రూ. 7 వేల కోట్లు వడ్డీలు కడుతోందని వెల్లడించారు. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు ఇచ్చిందని, ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ చీరలు, సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు పాలనా సేవలు ఇబ్బంది లేకుండా GHMCని మూడు భాగాలుగా విభజించామని చెప్పారు. సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, ఎలాంటి ఒడుదొడుకులు ఎదురైనా ఎదుర్కొంటానని, ప్రజలు అండగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.







# త్వరలో మణుగూరుకు రాపిడో సేవలు

**- ప్రయాణికులకు సౌకర్యం.. యువతకు ఉపాధి**

**- యాప్ ఆధారిత రవాణాకు కొత్త అవకాశం**

**మణుగూరు, ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్**

మణుగూరు పట్టణంలో త్వరలో రాపిడో సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ప్రయాణికులకు బైక్, ఆటో, క్యాబ్ సేవలను యాప్ ద్వారా ముందస్తుగా బుక్ చేసుకునే అవకాశం లభించనుంది. పట్టణంలో రోజువారీ ప్రయాణాలు చేసే ప్రజలకు ఇది మరో రవాణా మార్గంగా ఉపయోగపడనుంది. మణుగూరులో సింగరేణి సంస్థలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, మార్కెట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలకు రాకపోకలు అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో యాప్ ఆధారిత రవాణా సేవలు అందుబాటులోకి రావడం ప్రయాణికులకు మరింత సౌకర్యాన్ని కల్పించే అవకాశం ఉంది. మరోవైపు సొంత బైక్, ఆటో లేదా అర్హత కలిగిన వాహనాలు ఉన్న స్థానిక యువత రాపిడోలో భాగస్వాములుగా చేరి పూర్తి లేదా పాక్షిక సమయ ఉపాధి పొందే అవకాశం ఉంటుంది. అయితే డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు, బీమా, హెల్మెట్ తదితర నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. రాపిడో సేవలు మణుగూరులో ఎంతవరకు ఆదరణ పొందుతాయనేది ప్రయాణికుల స్పందన, డ్రైవర్ల లభ్యత, ధరలు, సేవల పరిధి,సమయపాలన వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. ప్రజలు, స్థానిక యువత ఈ అవకాశాన్ని నిబంధనలకు అనుగుణంగా వినియోగించుకుంటే పట్టణ రవాణాకు, యువత ఉపాధికి ఇది ప్రయోజనకరంగా మారే అవకాశం ఉంది.

# రేణుక చౌదరి జన్మదినం సందర్భంగా ఘనంగా రక్తదాన శిబిరం



**- రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన యువత**

**- సేవా కార్యక్రమాలకు పలువురి ప్రశంసలు**

**మణుగూరు, ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్ :**

కాంగ్రెస్ పార్టీ ఫైర్ బ్రాండ్, రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుక చౌదరి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మణుగూరులోని రేణుక చౌదరి క్యాంపు కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. గురజాల గోపి అధ్యక్షతన, గురజాల సందీప్, గురజాల సాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి యువత పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఇబ్బందులు పడుతున్న వారికి తమ రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో యువత స్వచ్ఛందంగా ముందుకు రావడం విశేషంగా నిలిచింది. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న మరొకరి ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుందని పలువురు యువకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువతను రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు అభినందించారు. వారికి ధ్రువపత్రాలు, జ్ఞాపికలను అందజేసి సేవాభావాన్ని ప్రశంసించారు. రక్తదానంతో పాటు ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. రేణుక చౌదరి జన్మదినాన్ని పురస్కరించుకుని కేవలం వేడుకలకే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే రీతిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు, యువత హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులతో పాటు యువజన నాయకులు గురజాల సందీప్, సాయి, రాము, శివ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు. శిబిరాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# కల్యాణలక్ష్మిపై న్యాయస్థానం బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి అనే సంఖ్యకు తాజా అధికారిక ధృవీకరణ అవసరం. కాబట్టి ఆ సంఖ్యలను నిర్ధారణ లేకుండా ప్రచురించడం కంటే ప్రభుత్వం నుంచి అధికారిక గణాంకాలు తీసుకోవడం సముచితం.

సంక్షేమ పథకమా.. చట్టబద్ధత ప్రశ్నా?

ఈ వ్యవహారం ఇప్పుడు రాజకీయ ఆరోపణలకు మించి రాజ్యాంగపర మైన చర్చకు దారితీసింది. పథకం అవసరమా అనే ప్రశ్న ఒకటి కాగా, ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా ప్రజాధనం ఖర్చు చేయడానికి అవసరమైన చట్టపరమైన ఆధారం ఏమిటన్నది మరో ప్రశ్న లేవనెత్తుతోంది. కోర్టు తుది తీర్పు వచ్చే వరకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల భవిష్యత్తుపై స్పష్టత రాదు. అదే సమయంలో వేలాది పేద కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కూడా తన వైఖరిని స్పష్టంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది. చట్టపరమైన లోపాలను ప్రభుత్వం సరిదిద్దుతుందా? హైకోర్టు తుది తీర్పు ఏమి చెబుతుంది? ఇప్పుడు తెలంగాణలో పేద కుటుంబాలు ఎదురుచూస్తున్న మూడు ప్రశ్నలకు సమాధానం ఎప్పుడు దొరుకుతుందో వేచి చూడాల్సిందే..

# సేవా కార్యక్రమాలతో రేణుక చౌదరి జన్మదిన వేడుకలు

**- విద్యార్థులు, ప్రత్యేక అవసరాల చిన్నారులు, వృద్ధులకు అన్నదానం**

**- 'సేవే నిజమైన వేడుక'.. రేణుక అక్షర మహిళా మండలి**

**మణుగూరు, ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్**



కాంగ్రెస్ ఫైర్ బ్రాండ్ రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు గురిజాల గోపి ఆదేశాల మేరకు మణుగూరు మండలంలో రేణుక అక్షర మహిళా మండలి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రేణుక చౌదరి శిబిర కార్యాలయంలో మహిళా మండలి అధ్యక్షురాలు పూనం సరోజ అధ్యక్షతన కార్యక్రమాలు జరిగాయి. మండలంలోని సంతోష్‌నగర్‌లో ని శ్రీ విద్యాభ్యాస విద్యా, సేవా ట్రస్టులో విద్యార్థుల సమక్షంలో గురిజాల గోపి, రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించారు.

అదేవిధంగా సంతోష్‌నగర్‌లోని శ్రీ సత్యసాయి ప్రత్యేక అవసరాల విద్యార్థుల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అన్నదానం చేశారు. అనంతరం ఉడతనేనినగర్‌లోని అమ్మానాన్న వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులకు భోజనం అందించారు. ఈ సందర్భంగా గురిజాల గోపి మాట్లాడుతూ రేణుక చౌదరి ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ప్రజా సేవలో ఆమె మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రజలకు సేవ చేసే శక్తి, ఆరోగ్యం, ఆయుష్షు భగవంతుడు ప్రసాదించాలని కోరారు. రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు మాట్లాడుతూ రేణుక చౌదరి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని జన్మదిన వేడుకలను సామాజిక సేవా కార్యక్రమాలతో నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు, ప్రత్యేక అవసరాల చిన్నారులు, వృద్ధులతో వేడుకలను పంచుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. నిరుపేదలు, బలహీన వర్గాలు, అవసరంలో ఉన్న వారికి అండగా నిలవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో రేణుక అక్షర మహిళా మండలి ఉపాధ్యక్షురాలు బొడ్డు సౌజన్య, కోశాధికారి ఎండి షబానా, నాయకులు కోరి శ్యామల, దేరంగుల సుజాత, కన్నపురం వసంత, బాడిశ పార్వతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి షరీఫ్, వెంకటాచారి, మాధవరెడ్డి, యువజన నాయకులు గురిజాల సందీప్, గురిజాల సాయి కిషన్ నాయక్, హేమంత్, సనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు పనులు వేగవంతం

**- 532 ఎకరాల భూసేకరణను వేగవంతం చేయాలి**

**- రైతులకు త్వరగా సాగునీరు అందించడమే లక్ష్యం**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్ :**



సీతారామ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో గురువారం సమావేశమయ్యారు. ప్రాజెక్టు పెండింగ్ పనులు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి అవసరాలపై చర్చించారు. మూడో పంప్‌హౌస్ నుంచి నాలుగో పంప్‌హౌస్ వరకు అవసరమైన 532 ఎకరాల భూసేకరణను రూ.45 కోట్లతో చేపట్టినట్లు తుమ్మల తెలిపారు. దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల్లో భూసేకరణ పూర్తయితే గోదావరి జలాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తయితే సుమారు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. మూడో, నాలుగో పంప్‌హౌస్‌ల మధ్య కాలువకు బదులుగా పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించే ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను పరిశీలించాలని కోరారు. దీంతో భూసేకరణ వ్యయం తగ్గడంతో పాటు రైతులు భూములు కోల్పోకుండా ఉంటారని తెలిపారు.

జూలూరుపాడు సొరంగం పనులను వేగవంతం చేసి పాలేరు జలాశయానికి నీరు అందించాలని తుమ్మల కోరారు. వైరా, లంకసాగర్ ప్రాంతాల సాగర్ ఆయకట్టు పంటలను రక్షించేందుకు మరోసారి సీతారామ నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రెండు, మూడు రోజుల్లో ఆయకట్టుకు నీరందించే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

**- అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు అందించాలి**

**- విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరచాలి**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 13, అనంతశక్తి న్యూస్**




సుజాతనగర్ మండలం సింగభూపాలెం, వేపలగడ్డ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం విస్తృతంగా పర్యటించి అభివృద్ధి, సంక్షేమ, వ్యవసాయ, విద్యా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సింగభూపాలెం చెరువును పరిశీలించిన కలెక్టర్.. ప్రస్తుతం 14.5 అడుగుల నీరు ఉందని అధికారులు వివరించగా, అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పెసర, కూరగాయలు, ఇతర ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. సింగభూపాలెంలో సుమారు 600 ఎకరాల్లో కూరగాయలు, 300 ఎకరాల్లో పెసర సాగవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్.. రెండో విడత ఇళ్ల కోసం జరుగుతున్న సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. సర్వేలో పారదర్శకత పాటిస్తూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మిషన్ భగీరథ పథకం కింద రూ.49 లక్షలతో నిర్మిస్తున్న నీటి సంప్ పనులను పరిశీలించిన కలెక్టర్.. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. సింగభూపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థుల తెలుగు, ఇంగ్లీష్ పఠన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. నెల రోజుల్లో తెలుగు, ఇంగ్లీష్, గణితంలో స్పష్టమైన పురోగతి కనిపించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.వేపలగడ్డలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ క్రీడా పోటీలను పరిశీలించారు. వంటగదిని తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని ఆదేశించారు. పాఠశాల, వసతి గృహ పరిసరాల్లో పరిశుభ్రత, విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్‌బాబు, తహసీల్దార్ కృష్ణప్రసాద్, వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్న నాగెల్లి

**మణుగూరు, ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్**

విధి నిర్వహణకు సంబంధించిన పని ముట్లతో పాటు రక్షణకు తగిన పరికరాలను సకాలంలో కార్మికులకు అందించడం ద్వారా నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలను అధిక మించడమే కాకుండా ప్రమాదాలు జరుగకుండా అరికట్టవచ్చని ఆ దిశగా సంబంధిత అధికారులు చొరవ చూపాలని ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రకాశం ఖని ఓపెన్ కాస్ట్ 2 డోజర్ విభాగాన్ని ఆయన సందర్శించారు. విధి నిర్వహణకు లో కార్మికులకు ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన అడిగి తెలుసుకున్నారు. రెస్ట్ షెల్టర్ ఏర్పాటు చేసినప్పటికీ అందులో కార్మికులకు అవసరమైన సౌకర్యాలు లేకపోవడం వల్ల ఎలుకుల బెడద తీవ్రంగా ఉందని కార్మికుల వస్తువులను ఎలుకలు ధ్వంసం చేస్తున్నాయని కబోర్డ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. డైనింగ్ హాల్, ఫ్లోరింగ్ సరిగా లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు.. మూత్రశాలలు అందుబాటులో లేకపోవడం వల్ల సుమారు 200 మీటర్లకు పైగా మల మూత్ర విసర్జనకు నడవవలసి వస్తుందని సమయం వృధా అవుతుందని అందుబాటులో మల మూత్రశాలాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. హెచ్. ఈయంయం కేటగిరి పదోన్నతులకు యాక్టింగ్ అర్హత సాధించినప్పటికీ నేటి వరకు ఆ ఖాళీలను భర్తీ చేయలేదని త్వరితగతిన భర్తీ చేపించాలని వారు తెలిపారు. వాటితో పాటు మరికొన్ని సమస్యలను వారు ప్రస్తావించగా సంబంధిత అధికారులు దృష్టికి కార్మికులు తెలిపిన సమస్యలను తీసుకువెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతానని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిరుత వెంకటేశ్వర్లు, గూగుల్ రమేష్‌నాయక్, పద్దం శ్రీనివాస్, సతీష్‌కుమార్, శ్రీనివాస్, సత్రాజు, సర్వేశ్, వివేక్ తదితరులు పాల్గొన్నారు



# ఈసీ చెబుతుంది పచ్చి అబద్ధం

## ఓటరు ఐడీ వివాదంపై.. ప్రకాశ్ రాజ్ విమర్శలు!

**హైదరాబాద్, ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్**

ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్, కర్ణాటక ఎన్నికల సంఘం మధ్య ఓటరు జాబితా సవరణ వ్యవహారం పెద్ద వివాదంగా మారింది. తన ఓటును తొలగించారంటూ ప్రకాశ్ రాజ్ ఆరోపించగా, ఆయన శాశ్వతంగా ఇల్లు మారినందునే షిఫ్టెడ్ అని గుర్తించామని, ఓటును తొలగించలేదని ఈసీ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం తీరుపై ప్రకాశ్ రాజ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కర్ణాటకలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా తన ఓటరు ఐడీని కొత్త చిరునామాకు మార్చుకోవాలంటూ ఎన్నికల సంఘం చెబుతుండటాన్ని ప్రకాశ్ రాజ్ సవాల్ చేశారు. తన పేరును బెంగళూరు ఓటరు జాబితా నుంచి పూర్తిగా తొలగించారని, ఆ తర్వాతే అధికారులు వారి తప్పు ఒప్పుకున్నారని ఆయన ఆరోపించారు.

**తాజాగా సోషల్ మీడియా వేదికగా ఒక వీడియో విడుదల చేసిన ప్రకాశ్ రాజ్.. ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. నా ఓటరు ఐడీ శాశ్వతంగా మారిపోయిందని మీ వెబ్‌సైట్‌లో పెట్టలేదా? అంటే నా ఓటు తొలగించారనే కదా అర్థం. అందుకే కొత్త ఓటరు ఐడీ కోసం ఫామ్-6 నింపాలని చెప్పారు. కానీ, నేను ఈ విషయాన్ని బయటపెట్టి, అది లక్షలాది మందికి చేరిన తర్వాత మీ అధికారులే ఫోన్ చేసి పొరపాటు జరిగిందని, సరిదిద్దుకుంటామని చెప్పారు కదా! అని ఆయన నిలదీశారు.**

**అయితే, ప్రకాశ్ రాజ్ ఆరోపణలను బెంగళూరు సెంట్రల్ సిటీ కార్పొరేషన్ అధికారులు తీవ్రంగా ఖండించారు. ఆయన ఓటు ఎక్కడికీ పోలేదని, యాక్టివ్‌గానే ఉందని స్పష్టం చేశారు. బూత్ లెవెల్ ఆఫీసర్ నిర్వహించిన విచారణలో.. ప్రకాశ్ రాజ్ గత నాలుగేళ్లుగా ఆ రిజిస్టర్డ్ అడ్రస్‌లో నివసించడం లేదని పక్కవార్లు, ఫ్లాట్ ఓనర్ నిర్ధారించారని తెలిపారు. అతడు ఉన్న ప్రాంతంలో విచారణ జరిపిన తర్వాతే ఆయన ఓటరు స్థితిని 'షిఫ్టెడ్'గా మార్చామని, ప్రస్తుత నివాస చిరునామా కోసం ఆయన ఫామ్-6 ద్వారా మళ్లీ రిజిస్టర్ చేసుకోవచ్చని అధికారులు వివరించారు.**

**అధికారుల ప్రకటనపై ప్రకాశ్ రాజ్ మరింత తీవ్రంగా స్పందించారు. ఎన్నికల సంఘం ఉద్దేశపూర్వకంగానే మాట మారుస్తోందని, ప్రెస్ మీట్ పెట్టి పచ్చి అబద్ధాలు చెబుతోందని ఆయన మండిపడ్డారు. వివాదం పెద్దది కావడంతోనే హడావుడిగా బిఎల్ఓ లను పంపి డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. ఈ పోరాటం కేవలం సెలబ్రిటీ అయిన తనకోసం కాదని, సామాన్య పౌరుడి ఆత్మగౌరవం కోసం అని స్పష్టం చేస్తూ.. ఈ అంశంపై మరిన్ని వీడియోలు, క్లారిఫికేషన్‌లు ఇస్తానని, గేమ్ ఆన్ అంటూ**



# ఐవీఎఫ్ వర్సెస్ ఐయూఐ తేడాలు, ప్రయోజనాలు

పిల్లల కోసం చాలా కాలంగా ప్రయత్నిస్తున్నా ఫలితం లేదా? అలాంటి వారికి ఇంట్రాటెరిన్ ఇన్‌సెమినేషన్ లేదా ఇన్ విట్రో ఫర్టిలైజేషన్ అనే రెండు పునరుత్పత్తి సహాయక పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఇవి గర్భం ధరించే ప్రక్రియను సులభతరం చేయడానికి ఉద్దేశించినవి అయినప్పటికీ, రెండింటికీ వేర్వేరు ప్రయోజనాలు, ఇబ్బందులూ ఉన్నాయి. మీ ప్రత్యేక పరిస్థితులకు ఏది సరిపోతుందో వైద్యులు మీకు సలహా ఇస్తారు.



"గర్భం ధరించడంలో సవాళ్లను ఎదుర్కొంటున్న వ్యక్తులు, దంపతులకు, ఇంట్రాటెరిన్ ఇన్‌సెమినేషన్ , ఇన్ విట్రో ఫర్టిలైజేషన్ అనేవి రెండు సాధారణ సహాయక పునరుత్పత్తి సాంకేతికతలు" అని ఆమె చెప్పారు. "రెండూ గర్భధారణ అవకాశాన్ని పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, వాటి ప్రక్రియ, క్లిష్టత, ఖర్చు, ఎవరికి సరైనవి అనే విషయాలలో గణనీయంగా తేడా ఉంటాయి"

**ఐయూఐ అంటే ఏమిటి?**

ఐవీఎఫ్ కంటే ఐయూఐ తక్కువ సంక్లిష్టమైనదని, తక్కువ సమయంలో పూర్తయ్యే ప్రక్రియ అని డాక్టర్ సూరి తెలిపారు. "ఐయూఐ అనేది సాపేక్షంగా సరళమైన ప్రక్రియ. ఇక్కడ సిద్ధం చేసిన వీర్యాన్ని అండం విడుదలయ్యే సమయానికి నేరుగా గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. ఈ ప్రక్రియ ఐవీఎఫ్ కంటే తక్కువ సంక్లిష్టమైనది. సాధారణంగా తక్కువ ఖర్చుతో కూడుకున్నది. ఒక్కో సైకిల్‌కు



10-20 శాతం విజయావకాశాలు ఉంటాయి. ఇది వయస్సు, సంతానోత్పత్తి నిర్ధారణ వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది" అని వివరించారు.

"పురుషుల్లో స్వల్పంగా సంతానలేమి సమస్యలు ఉన్నప్పుడు, లేదా సర్వైకల్ మ్యూకస్ (గర్భాశయ శ్లేష్మం) సమస్యలు ఉన్న సందర్భాలలో ఐయూఐ ఆదర్శవంతమైనది. దీనికి శారీరక, ఆర్థిక భారం తక్కువ కాబట్టి, సాధారణంగా దీనిని మొదటి చికిత్సా పద్ధతిగా పరిగణిస్తారు. అండం విడుదలను ప్రేరేపించడానికి మందులను ఐయూఐతో పాటు ఉపయోగించవచ్చు. అయితే, ఇది కవలలు వంటి బహుళ గర్భధారణల ప్రమాదాన్ని కొద్దిగా పెంచుతుంది" అని



డాక్టర్ సూరి తెలిపారు.

**ఐవీఎఫ్ అంటే ఏమిటి?**


దీనికి విరుద్ధంగా, ఐవీఎఫ్ అనేది మరింత సంక్లిష్టమైన ప్రక్రియ. ఇందులో అండాశయ ప్రేరణ, అండాలను తిరిగి పొందడం, ప్రయోగశాలలో అండాలను ఫలదీకరణం చేయడం, ఆపై పిండాన్ని గర్భాశయంలోకి బదిలీ చేయడం వంటివి ఉంటాయని డాక్టర్ సూరి చెప్పారు.

"అధిక సంతానోత్పత్తి అడ్డంకులు ఉన్నప్పుడు ఐవీఎఫ్ సిఫార్సు చేస్తారు. ఉదాహరణకు, ఫాలోపియన్ ట్యూబులు బ్లాక్ అవ్వడం, ఎండోమెట్రియోసిస్, పురుషులలో తీవ్రమైన సంతానలేమి, వయస్సు పెరగడం లేదా ఐయూఐ యొక్క అనేక సైకిల్స్ విఫలమైనప్పుడు ఐవీఎఫ్‌ను సూచిస్తారు. ఐవీఎఫ్ విజయావకాశాలు గణనీయంగా ఎక్కువగా ఉంటాయి, 35 ఏళ్ల లోపు మహిళలకు ఒక్కో సైకిల్‌కు తరచుగా 40-50 శాతం ఉంటుంది. అయితే వయస్సు పెరిగే కొద్దీ ఈ రేటు తగ్గుతుంది" అని ఆమె వివరించారు.



# వాకింగ్ అల్జీమర్స్ ముప్పును తగ్గిస్తుందని తేల్చిన అధ్యయనం





రోజూ నడవడం ద్వారా జ్ఞాపకశక్తి మందగించే ప్రమాదం తగ్గుతుందని, ముఖ్యంగా జన్యుపంగా అల్జీమర్స్ వ్యాధికి ఆస్కారం ఉన్నవారికి ఇది మరింత ప్రయోజనకరమని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. దాదాపు 3,000 మంది 70 నుండి 79 సంవత్సరాల వయస్సు గలవారిని పదేళ్లపాటు పర్యవేక్షించి ఈ ఫలితాలను వెల్లడించింది. పరిశోధకులు వారి రోజువారీ నడక అలవాట్లను గమనించారు. ఈ అలవాట్లను కొనసాగించడం లేదా పెంచడం వల్ల మెదడు సమాచారాన్ని ప్రాసెస్ చేసే వేగం , కార్యనిర్వాహక పనితీరు మెరుగుపడ్డాయని గుర్తించారు. ఇవి రెండూ మెదడు ఆరోగ్యానికి కీలకమైన అంశాలు.

ఈ అధ్యయనానికి ప్రధాన రచయిత, యూనివర్సిటీ ఆఫ్ కాల్గరీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ అయిన డాక్టర్ సిండి బర్వా, ఎక్కువసేపు కూర్చునే జీవనశైలి నివారించడం ఎంత ముఖ్యమో నొక్కి చెప్పారు. ఎక్కువసేపు కూర్చునే సమయాలను విచ్ఛిన్నం చేయడానికి, రోజంతా చిన్నపాటి నడక సెషన్లను దినచర్యలో చేర్చుకోవాలని ఆమె సూచిస్తున్నారు.

**అల్జీమర్స్ వ్యాధి అంటే ఏమిటి?**

అల్జీమర్స్ వ్యాధి అనేది ఒక సంక్లిష్టమైన రుగ్మత. దీనిని డిమెన్షియా యొక్క తీవ్రమైన రూపంగా పరిగణిస్తారు. మెదడులో హానికరమైన ఫలకాలు పేరుకుపోవడం దీని ప్రధాన లక్షణం. ఈ ఫలకాలు నరాల కణాల మధ్య కమ్యూనికేషన్‌ను అడ్డుకుంటాయి. చివరికి వాటి మరణానికి దారితీస్తాయి. నరాల కణాలు క్షీణించడంతో, వ్యక్తులు ఈ కింది సమస్యలను ఎదుర్కోవచ్చు..

జ్ఞాపకశక్తి కోల్పోవడం: ఇటీవల జరిగిన సంఘటనలు లేదా వ్యక్తిగత అనుభవాలను గుర్తుంచుకోవడంలో



ఇబ్బంది.

గందరగోళం: ముఖ్యంగా పరిచయమున్న ప్రదేశాలలో దిక్కుతోచని స్థితి.

వ్యక్తిత్వ మార్పులు: ప్రవర్తన లేదా మానసిక స్థితిలో గుర్తించదగిన మార్పులు.

దురదృష్టవశాత్తు, ప్రస్తుతం అల్జీమర్స్ వ్యాధికి చికిత్స లేదు. కాబట్టి నివారణ వ్యూహాలు మరింత ముఖ్యమైనవిగా మారాయి.

**అల్జీమర్స్ వ్యాధిలో జన్యువుల పాత్ర ఏమిటి?**

అల్జీమర్స్ వచ్చే అవకాశంలో జన్యు కారకాలు గణనీయమైన పాత్ర పోషిస్తాయి. "ముఖ్యంగా, APOE4 అని పిలువబడే ఒక జన్యు వైవిధ్యం మెదడు నుండి వ్యాధి సంబంధిత ఫలకాలను తొలగించడం మరింత కష్టతరం చేస్తుంది. సుమారు 15%



నుండి 25% జనాభా ఈ వైవిధ్యాన్ని కలిగి ఉంది. దీనిని జన్యు పరీక్ష ద్వారా మాత్రమే గుర్తించవచ్చు" అని న్యూరాలజిస్ట్ డాక్టర్ నేహా కపూర్ హెల్త్ షాట్స్‌కు తెలిపారు.


**అల్జీమర్స్ మెదడు, శరీరాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?**


అధ్యయనం నిర్దిష్ట నడక దినచర్యను సూచించనప్పటికీ, డాక్టర్ బర్వా నిశ్చల జీవనశైలిని కొద్దికొద్దిగా నడవడం ద్వారా విచ్ఛిన్నం చేయడం వల్ల మెదడు ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని ప్రతిపాదించారు.

**నడకకు సిఫార్సులు:**

తరచుగా: రోజంతా అనేక చిన్న నడక సెషన్లను లక్ష్యంగా పెట్టుకోండి.

స్థిరత్వం: ఏటా స్థిరమైన నడక అలవాటును కొనసాగించండి.





# 'రాకా' ప్రపంచంలో ఎవరెలా?








అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాకి సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా బయట పెట్టింది కొన్ని విషయాలే! ఇందులో నటిస్తున్న తారాగణంపై కూడా ఇంకా పూర్తిగా స్పష్టత లేదు. కథానాయికగా దీపికా పదుకొణె పేరు మాత్రమే ఇప్పటివరకూ ఖరారైంది. ఆమెతోపాటు... మరో ముగ్గురు ప్రముఖ కథానాయికలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అతిథి పాత్రల గురించి కూడా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆ పరంపరలోనే షారుక్ ఖాన్, షాహిద్ కపూర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలోని కథానాయికల పాత్రలపై కూడా కొన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ ముంబయిలోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతుండడం, అక్కడ్నుంచి పలు విషయాలు ప్రచారంలోకి వస్తుండడంతో సినీ ప్రేమికులు వాటి గురించి ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ చర్చించుకుంటున్నారు. దీపిక ఇందులో గర్భవతిగా కనిపించనున్నారని, ఆమె ప్రస్తుతం గర్భంతోనే ఉండటం సినిమాకి కలిసొచ్చిందని బాలీవుడ్ వర్గాలు చెప్పకుంటున్నాయి. ఆమె ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఇందులో మరో కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ ఓ గిరిజన యువతిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, రష్మిక పాత్ర దీపికా పాత్ర చేసే పోరాటానికి మార్గ నిర్దేశనం చేసే పాత్రలో కనిపించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇందులో మృణాల్ ఠాకూర్ కూడా ఓ కీలకపాత్రని పోషిస్తున్నట్టు సమాచారం. 'రాకా' ప్రపంచంపైనా, ఇందులోని పాత్రలపైనా స్పష్టత రావడానికి మరింత సమయం పడుతుంది. పురాణాలు, ఆధునిక కాలం మేళవింపుగా ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోంది.

# ఫోన్ వల్లే రూ.3లక్షల ఖర్చు.. నరకయాతన: నటి షకీల

: ప్రముఖ నటి షకీల ఇటీవల తనకు ఎదురైన ఒక భయంకరమైన ఆరోగ్య సమస్య గురించి అభిమానులతో పంచుకున్నారు. అతిగా మొబైల్ ఉపయోగించడం వల్ల తాను తీవ్రమైన మెడ నొప్పితో బాధపడ్డానని, దీనివల్ల రూ.3 లక్షల ఖర్చుతో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె వెల్లడించారు. ఈ విషయాన్ని తెలుపుతూ అభిమానులకు జాగ్రత్తలు చెప్పారు. ఫోన్‌లో చాలాసేపు గేమ్స్ ఆడటం, యూట్యూబ్, ఇన్‌స్టాలో రీల్స్ చూడటం వల్ల తనకు ఈ పరిస్థితి వచ్చిందని షకీల తెలిపారు. నిద్రపోయే సమయంలో కూడా ఒక పక్కకు వాలి గంటలు గంటలు ఫోన్ చూడటంతో మెడలోని నరాలపై తీవ్ర ప్రభావం పడిందని, అందుకే శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. "ఫోన్ చాలా ముఖ్యం. కానీ, అవసరానికి మించి దాన్ని వాడకండి. ఉపయోగం లేని వీడియోలను చూస్తూ సమయం వృథా చేయకండి. సరిగ్గా వాడకపోతే డబ్బులు పోవడమే కాకుండా, భరించలేని నరకయాతన అనుభవించాల్సి వస్తుంది. చిన్న పిల్లలకు ఫోన్ ఇవ్వడంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. మొబైల్ వాడకాన్ని తగ్గించాలి" అని షకీల కోరారు.

18 ఏళ్ల వయసులో 'ప్లే గర్ల్స్' అనే తమిళ చిత్రంతో షకీల ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 2000 సంవత్సరంలో వచ్చిన మలయాళ చిత్రం 'కిన్నార తుంబికల్' ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. డైరెక్టర్ తేజ రూపొందించిన 'జయం' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత నిజం, బంగారం, తొట్టిగ్యాంగ్ వంటి పలు చిత్రాల్లో ఆమె నటించారు.



# సుకుమార్ కుమార్తె మరో అరుదైన ఘనత



: 'పుష్ప' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో దర్శకుడిగా మంచి గుర్తింపు పొందారు సుకుమార్. ఇటీవల జాతీయ అవార్డుల్లో ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగానూ ఘనత సాధించారు. ఆయన తనయ సుకృతి వేణి కూడా విభిన్న బాటలో పయనిస్తున్నారు. 2024 సంవత్సరానికి జాతీయ ఉత్తమ బాల నటిగా 'గాంధీ తాత చెట్టు'కు అవార్డు సాధించిన సుకృతి వేణి ఇప్పుడు మరో అరుదైన ఘనతను కైవసం చేసుకుంది. అమెరికాలోని 'బోస్టన్ అంతర్జాతీయ బర్క్‌లీ స్కూల్ ఆఫ్ మ్యూజిక్' సంగీత విభాగంలో ఎన్‌సెంబుల్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికై ఫుల్ స్కాలర్‌షిప్‌ను సొంతం చేసుకున్నారు. మొత్తం 272 మంది పిల్లలు ఆడిషన్ ఇవ్వగా, కేవలం 14 మందికి మాత్రమే పూర్తి స్కాలర్‌షిప్ వచ్చింది. అందులో సింగర్స్ విభాగంలో ఎంపికైన ఏకైక విద్యార్థిని సుకృతి వేణి కావడం విశేషం.

# ఆర్సీబీపై ఆ సెంచరీనే నా కెరీర్‌ను నిలబెట్టింది: డేవిడ్ మిల్లర్



తన కెరీర్ నిలబడేందుకు ఐపీఎల్‌లో చేసిన ఓ సెంచరీనే కారణమని దక్షిణాఫ్రికా ఆటగాడు డేవిడ్ మిల్లర్ వ్యాఖ్యానించాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పలు విషయాలపై అతడు మాట్లాడాడు. వచ్చే ఏడాది స్వదేశంలో జరిగే ప్రపంచ కప్‌ను గెలిచి ఆటకు వీడ్కోలు పలకాలని ఉందని చెప్పాడు. ఇక ఐపీఎల్‌లో గుర్తుండిపోయే ఇన్నింగ్స్‌ల గురించి ప్రస్తావించాడు.

"రాయల్ ఛాలెంజర్స్ జట్టుపై 2013 ఐపీఎల్ సీజన్‌లో 101 పరుగుల ఇన్నింగ్స్ ఆడా. పంజాబ్ కింగ్స్ తరపున బరిలోకి దిగిన నాకు అదే ఫస్ట్ టీ20 సెంచరీ. చాలా గుర్తింపు తీసుకొచ్చింది. నా కెరీర్‌లో ఒక్కసారిగా ఊపు వచ్చింది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆస్ట్రేలియాపై ఆడిన ఇన్నింగ్స్ మరిచిపోలేను.. డర్బన్ వేదికగా ఆసీస్ ఛేజింగ్‌లో శతకం కొట్టా. ఇప్పుడ నేను చెప్పిన ఆ రెండు సెంచరీలు తీవ్ర ఒత్తిడిలో ఆడినవే. అందుకే, నా దృష్టిలో అవి ఉత్తమం. బ్యాటర్‌గా నా కెరీర్‌ను మ్యాచులను ఫినిష్ చేసే స్థాయికి తీసుకెళ్లా. నేను మంచి ఫినిషర్ అని భావిస్తా. ఆ విషయంలో గర్వంగా ఫీలవుతా. కానీ, ఇప్పటికీ నేర్చుకోవడం మాత్రం ఆపలేదు. సుదీర్ఘకాలం కెరీర్‌ను కొనసాగించాలంటే మాత్రం తప్పిదాల నుంచి నేర్చుకోవాలి. ఛేజింగ్‌లో నాణ్యమైన ఆటతీరు ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తా. అలాంటి సవాళ్లను ఇష్టపడతా" అని మిల్లర్ వెల్లడించాడు.

37 ఏళ్ల డేవిడ్ మిల్లర్ 2010లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. ఇప్పటి వరకు 178 వన్డేల్లో 4,611 పరుగులు, 140 టీ20ల్లో 2,806 పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో 152 మ్యాచులు ఆడిన మిల్లర్ 3,288 రన్స్ రాబట్టాడు. మిడిలార్డర్‌లో విలువైన ఇన్నింగ్స్‌లు ఆడటంలో గుర్తింపు సాధించాడు. అయితే, అతడి కెరీర్‌లో ఒక్క టెస్టు మ్యాచ్ కూడా ఆడకపోవడం గమనార్హం.

# అర టన్ను కొకైన్ సీజ్.. ప్యాకెట్లపై ఫుట్‌బాల్ స్టార్ ఫొటోలు..!

ఈక్వెడార్‌లో భారీ మొత్తంలో డ్రగ్స్‌ను అక్కడి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 470 కేజీల నుంచి 500 కేజీల వరకూ కొకైన్‌ను పట్టుకున్న పోలీసులు.. సరకును తరలిస్తున్న వాహనాన్ని జప్తు చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఆ కొకైన్ ప్యాకెట్లపై నార్వే ఫుట్‌బాల్ స్టార్ ఆటగాడు ఇర్లింగ్ హాలాండ్ ఫొటోలు ఉండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దీనిపై పోలీసుల నుంచి ఎలాంటి వివరణ రాలేదు. డ్రగ్స్ విలువ దాదాపు రూ. 110 కోట్ల వరకూ ఉండొచ్చని అంచనా. ఈక్వెడార్‌లో డ్రగ్స్‌ను తరలించడం, అందుకోసం స్మగ్లర్లు ఎక్కువగా క్రీడాకారులు, సెలబ్రిటీల ఫొటోలను వినియోగించడం సర్వసాధారణమైన విషయమని విశ్లేషకులు చెబుతున్నారు. ప్లేయర్ లేదా సెలబ్రిటీ చిత్రాన్ని బట్టి.. సదరు క్లయింట్‌కు స్మగ్లింగ్ నెట్‌వర్క్ ఎలాంటి డ్రగ్‌ను పంపిస్తున్నారన్నది ఈజీగా తెలిసిపోతుంది. తాజాగా యాంటీ నార్కోటిక్స్ బృందాలు చేసిన దాడుల్లో ట్రక్ అడుగు భాగాన దాదాపు 370 బాక్స్‌లను కనిపెట్టి స్వాధీనం చేసుకున్నాయి. కేవలం హాలాండ్ మాత్రమే కాదు.. గతంలో అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సి బొమ్మలను కూడా స్మగ్లర్లు వినియోగించిన దాఖలాలు ఉన్నాయి.

# గంభీర్ ముక్కుసూటి మనిషి.. అందుకే నచ్చడం లేదేమో: హర్భజన్ సింగ్

టీమ్‌ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పై వస్తోన్న విమర్శలను మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ ఖండించారు. ఏదైనా మ్యాచ్ లేదా సిరీస్ ఓడిపోతే వెంటనే కోచ్‌పైనే విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. గంభీర్ ముక్కుసూటిగా ఉండే మనిషి అని ప్రశంసించాడు. అందుకే అతడి నిర్ణయాలు కొందరికి నచ్చడం లేదేమోనని హర్భజన్ వ్యాఖ్యానించాడు. గంభీర్ కోచింగ్‌లో మన జట్టు ఐసీసీ టోర్నీలను గెలిచిన విషయాన్ని గుర్తు చేశాడు.

"గంభీర్ ఎందుకు ఇంతలా విమర్శలు ఎదుర్కొంటున్నాడు? జట్టు బాగా ఆడకపోతే వెంటనే కోచ్‌ను నిందించడం ఏంటో ఇప్పటికీ అర్థం కావడం లేదు. అతడు క్రికెట్ ఆడుతున్నప్పటి నుంచీ నాకు తెలుసు. ఆటపట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి. కెరీర్ తొలినాళ్లలో గంభీర్ చాలా తక్కువగా మాట్లాడేవాడు. సెహ్వాగ్, అమిత్ మిశ్రా, మునాఫ్ పటేల్ అతడికి మంచి స్నేహితులు. ఇప్పటికీ వారే ఫ్రెండ్స్ అనుకుంటా. అతడు ముక్కుసూటి మనిషి. వాస్తవాలను నిక్కచ్చిగా మాట్లాడతాడు. అందుకే అతడి నిర్ణయాలు కొందరికి మింగుడుపడవు. కవర్ చూసి పుస్తకాన్ని ఎలాంటిదో నిర్ణయించకూడదని పెద్దలు అంటారు. పైకి అలా ఉండే గంభీర్‌ను విమర్శించడమూ తప్పే. విజయం కోసమే ఆడాలి అని బలంగా నమ్మే కోచ్ అతడు. ఓటమిని కనీసం ఊహించడానికి కూడా ఇష్టపడడు. డ్రా కోసం వెళ్లేందుకూ సుముఖత వ్యక్తం చేయడు" అని హర్భజన్ తెలిపాడు.

శుభ్‌మన్ సక్సెస్ వెనుక..

"ఎవరికైనా సరే సక్సెస్ ఒక్కసారిగా వచ్చేయదు. శుభ్‌మన్ గిల్ విషయంలోనూ అంతే. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో అతడి కెప్టెన్సీని చూశాం. అతడి సత్తా మనందరికి తెలిసింది. బ్యాటర్‌గా పరుగులు రాబట్టాడు. సారథిగా జట్టును బాగా నడిపించాడు. ప్రతి ప్లేయర్ కెరీర్‌లో ఒడుదొడుకులు సహజమే. గిల్ క్రికెట్ బ్రెయిన్ గొప్పది. వ్యక్తిగతంగానూ అతడు చాలా అద్భుతం" అని హర్భజన్ ప్రశంసించాడు. పరుగులు చేస్తున్నారుగా.. "లియోనెల్ మెస్సి, క్రిస్టియానో రొనాల్డో ఇప్పటికీ ఫుట్‌బాల్ ఆడుతున్నారు. మరి విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డేల్లో కొనసాగితే తప్పేంటి? ఏ ప్లేయర్‌కైనా సరే ప్రదర్శనే గీటురాయి. వయసు ముఖ్యం కాదు. విరాట్ వయసు 37 ఏళ్లు దాటినా.. ఇరవై ఏళ్ల కుర్రాడిలా మైదానంలో హుషారుగా ఉంటాడు. మెస్సిని ఆపాలంటే ఇప్పటికీ ఐదుగురు ప్లేయర్లు కష్టపడాలి. భారత జట్టులో ఫిట్‌నెస్‌కు సంబంధించి మార్పులు తీసుకొచ్చింది కోహ్లీనే. చివరి రోజు 400 పరుగులు లక్ష్యం ఉన్నా సరే



విజయం కోసం పోరాడాలని సహచరుల్లో స్ఫూర్తి నింపుతాడు. ఒకవేళ ఇప్పుడు ఓటమి ఎదురైనా ఏదొక రోజు సాధించి తీరుతామని చెప్పేవాడు. వైభవ్ సూర్యవంశీ దూకుడు మనందరికీ తెలుసు. కానీ, విరాట్ - రోహిత్ కు అనుభవం ఉంది. వీరిద్దరు ఇప్పుడు ఎలా ఆడుతున్నారనేదే ముఖ్యం. ఇటీవల మ్యాచుల్లో ప్రదర్శన చూస్తే వీరిద్దరూ సఫలమైనట్లే" అని హర్భజన్ వెల్లడించాడు.

# భారత్‌తో టీ20 సిరీస్.. షెడ్యూల్ మార్చాలనుకుంటున్న అఫ్గానిస్థాన్!

సెప్టెంబరులో అఫ్గానిస్థాన్, భారత్ మధ్య జరగనున్న మూడు టీ20ల సిరీస్ షెడ్యూల్‌లో మార్పులు జరిగే అవకాశముంది. దిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియమే వేదికగా సెప్టెంబరు 13, 15, 17వ తేదీల్లో టీ20 మ్యాచ్‌లు జరుగుతాయని బీసీసీఐ, అఫ్గానిస్థాన్ క్రికెట్ బుధవారం బోర్డు సంయుక్త ప్రకటన చేశాయి. తమ దేశంలో అస్థిర పరిస్థితుల కారణంగా చాలా కాలంగా హోమ్ సిరీస్‌లను భారత్ కేంద్రంగా ఆడుతోన్న అఫ్గాన్.. భారత్‌తో జరగబోయే టీ20 సిరీస్‌కు ఆతిథ్య దేశంగా వ్యవహరిస్తుండటం విశేషం. ఈ క్రమంలో గురువారం ఓ వార్త బయటికొచ్చింది. ఆతిథ్య దేశంగా ఉన్న అఫ్గాన్ సిరీస్ షెడ్యూల్‌ను మార్చాలని యోచిస్తోందని సమాచారం. షెడ్యూల్‌లో మార్పులు చేసి మొదటి లేదా రెండో టీ20ని సెప్టెంబరు 14న (వినాయక చవితి) నిర్వహించాలని భావిస్తోందట. ఆ రోజు సోమవారం అయినప్పటికీ పండగ సెలవు దినం కావడంతో మ్యాచ్‌ను వీక్షించడానికి స్టేడియానికి ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో వస్తారని అఫ్గాన్ క్రికెట్ బోర్డు ఆశిస్తోంది. మ్యాచ్‌కు టీవీ, డిజిటల్ వీక్షణలు కూడా పెరిగే ఛాన్స్ ఉండటంతో ఈ ఆలోచన చేస్తోందట. ఈ విషయాన్ని ఇప్పటికే అఫ్గాన్.. బీసీసీఐ దృష్టికి తీసుకువెళ్లిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ ప్రతిపాదనకు బీసీసీఐ అంగీకరిస్తేనే షెడ్యూల్‌లో మార్పులు జరుగుతాయి.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945